# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 101 శనివారం 03 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# భారత్ , చైనా మధ్య చర్చలు

## బోర్డర్ సమస్య పరిష్కారం

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**

దాదాపు రెండేళ్లుగా భారత్-చైనా సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉంది. గల్వాన్ ఘటనతో మొదలైన ఉద్రిక్తతలు ఇప్పటికీ అదుపులోకి రాలేదు. ఇటీవలే తవాంగ్‌లోనూ ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగారు. పదేపదే చైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ఓ వైపు ఇలా ఘర్షణ పడుతూనే...భారత్‌తో చర్చలు కొనసాగిస్తోంది చైనా. ఇప్పటికే దాదాపు 18 సార్లు కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. క్రమక్రమంగా బలగాలను ఉపసంహరించుకున్నాయి భారత్, చైనా. కానీ...మధ్యలో మళ్లీ చైనా కవ్వించడం వల్ల భారత్ కూడా పెద్ద ఎత్తున సైన్యాన్ని మోహరించింది. అత్యాధునిక ఆయుధాలనూ సిద్ధం చేసుకుంది. ఎప్పుడు చైనా యుద్ధానికి దిగినా వెంటనే దీటైన బదులిచ్చేందుకు రెడీ అయిపోయింది. అయితే...యుద్ధం వరకూ పరిస్థితులు వెళ్లకుండా చర్చలతోనే వివాదానికి

02



## తెలంగాణ ప్రజలకు ప్రధాని, రాష్ట్రపతి శుభాకాంక్షలు





**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

తెలంగాణ రాష్ట్రం పదవ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ .. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ముర్ము తన ట్విట్టర్లో తెలంగాణ ప్రజలకు గ్రీటింగ్స్ తెలుపుతూ.. రాష్ట్రంలో అడువులు, వన్యప్రాణులు సుసంపన్నంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నైపుణ్యవంతమైన ప్రజలు ఉన్నారని, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం కూడా సంపన్నమైందని ఆమె అన్నారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రం ఆవిష్కరణలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్రంగా మారుతున్నట్లు ముర్ము తన ట్విట్టర్లో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అనునిత్యం ప్రగతిపథంలో ముందుకు సాగాలని ఆమె బెస్ట్ విషెస్ తెలిపారు.

ప్రధాని మోదీ కూడా తన ట్విట్టర్లో శుక్రవారం స్పందించారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్ర

02



## వైఎస్ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాండి-హై కోర్టు

**ప్రజా తపన ,హైదరాబాద్:**

వైఎస్ వివేకా హత్య కేసులో అరెస్ట్ అయిన వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. బెయిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 5కి వాయిదా వేసింది. వివేకా హత్య కేసులో ఐదు మంది నిందితులను సీబీఐ కోర్టు ముందు హాజరుపరిచింది. ఎర్ర గంగి రెడ్డి, సునీల్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డిను సీబీఐ కోర్టు ఎదుట హాజరుపరిచింది. భాస్కర్ రెడ్డి అనారోగ్య కారణంతో హాజరు కాలేకపోయారని న్యాయవాదులు తెలిపారు. విచారణకు అప్రూవర్ దస్తగిరి హాజరు కాలేదు. తదుపరి విచారణను 16వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

అప్పటికే అవినాష్ రెడ్డికి ముందస్తు బెయిల్ అవినాష్ రెడ్డిని సీబీఐ

02

## ఆరు దశాబ్దాల అలుపెరుగని పోరాటం

**2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం**

**అవరోధాలను అధిగమిస్తూ దేశంలోనే అత్యంత బలీయమైన ఆర్థికశక్తిగా ఎదిగాం**

**తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో ముఖ్య మంత్రి కెసిఆర్**

**ప్రజా తపన ,హైదరాబాద్ :**



తెలంగాణ సమాజం ఆరు దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకుంది. ప్రజల ఆశయం జయించి, 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ ఆవిర్భవించిన నాటి దృశ్యం గుర్తుచేసుకుంటే.. ఏ రంగంలో చూసినా విధ్వంసమే. అంతటా అలుముకున్నది గాఢాంధకారమే. అస్పష్టతలను, అవరోధాలను అధిగమిస్తూ తెలంగాణ దేశంలోనే అత్యంత బలీయమైన ఆర్థికశక్తిగా

02

## వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ప్రారంభం

**ప్రజా తపన , గుంటూరు**

చిన్న రైతులకు మేలు జరిగేలా ఖర్చు తగ్గించేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ యంత్ర సేవా పథకాన్ని ప్రారంభించారు. గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లో ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లను జెండా ఊపి సీఎం జగన్ ప్రారంభించారు. వ్యవసాయంలో వంద శాతం యాంత్రీకరణ జరిగేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు సీఎం జగన్

ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్

02



## రెండు సరికొత్త రికార్డులను సాధించిన విశాఖ పోర్టు

**మే లో 49 కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసి రికార్డు**

**ప్రజా తపన ,విశాఖపట్నం :**

పోర్టు అథారిటీ పరిధిలోని బీవోటీ/ పీపీపీ ఆపరేటర్ గా ఉన్న విశాఖ కంటైనర్ టెర్మినల్ లో .. మే నెలలో అత్యధికంగా 61468 టీయూఈ (ుజఇబ) ల కంటైనర్లను హ్యాండిల్ చేసింది. మార్చి 2023లో హ్యాండిల్ చేసిన 56578 టీయూఈల కంటైనర్ల హ్యాండ్లింగ్ మాత్రమే ఇప్పటి వరకు రికార్డుగా ఉంది. విశాఖ కంటైనర్ టెర్మినల్ పొడవు 390 మీ, వెడల్పు 42 మీటర్లు కాగా.. 16 మీటర్ల డ్రాఫ్ట్ ను కలిగి ఉంది. అలాగే మే 2023లో 49 కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేయడం ద్వారా విశాఖ కంటైనర్ టెర్మినల్ మరో మైలురాయిని అధిగమించింది. ఒకే నెలలో అత్యధిక కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసిన రికార్డును తిరగ రాసింది.

ఏప్రిల్ 2023లో విశాఖ కంటైనర్ టెర్మినల్ లో 42 కంటైనర్ షిప్పులను

02

## ఈనెల నుంచే రోడ్లపైకి వారాహి

**రూట్ మ్యాప్ సిద్ధం చేసిన పవన్ కళ్యాణ్!**

**ప్రజా తపన ,అమరావతి**

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన వాహనం వారాహి. ఈ ప్రచార వాహనంతో ప్రజల్లోకి రావాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. ఈ మేరకు వారాహి రూట్ మ్యాప్ సిద్ధం చేసింది జనసేన. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహిస్తారు.



02

# భారత్ , చైనా మధ్య చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తోంది భారత్. అందుకే మరోసారి ఆ దేశంతో చర్చలకు సిద్ధమైంది. సరిహద్దు వద్ద బలగాల ఉపసంహరణపై రెండు దేశాల మధ్య దౌత్య సమావేశం జరగనుంది. ఇదే విషయాన్ని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. సరిహద్దు ఒప్పందాలకు కట్టుబడి అక్కడ ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పేలా ప్రయత్నిస్తున్నట్టు స్పష్టం చేసింది. ద్వైపాక్షిక సంబంధాలనూ దారికి తీసుకురావాలని భావిస్తోంది. అందుకే వీలైనంత త్వరగా ఈ కీలక భేటీకి ముహూర్తం పెట్టనున్నారు. "ఇరు దేశాలూ సరిహద్దు వద్ద ఎలాంటి పరిస్థితులున్నాయో పరిశీలించాయి. వీలైనంత త్వరగా బలగాలను ఉపసంహరించుకోవాలని కోరుకుంటున్నాం. ఈ విషయంలో బహిరంగంగానే మా డిమాండ్‌లు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ శాంతియుత వాతావరణం నెలకొంటే కానీ ద్వైపాక్షిక సంబంధాలు బలపడవు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 19వ సారి సమావేశమవుతున్నాం. సీనియర్ కమాండర్‌లు ఇందులో పాల్గొంటారు "అరుణాల్ ప్రదేశ్ విషయంలో చైనా మొండి వాదన మానడం లేదు. పైగా పేర్లు మారుస్తామంటూ సంచలన ప్రకటన చేసింది. ఈ వివాదం ముదురుతున్న క్రమంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించారు. దీనిపై చైనా తీవ్రంగా స్పందించింది. ఈ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ భూభాగంలో అమిత్‌షా పర్యటించి నిబంధనలు ఉల్లంఘించారని మండి పడింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ దీనిపై ఓ నోట్ విడుదల చేసింది. ఈ మధ్యే చైనా అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల పేర్లు మార్చింది. అవన్నీ చైనాలో భాగమే అని తేల్చి చెప్పింది. "జంగ్నన్ మాదే" అంటూ అరుణాచల్‌కు కొత్త పేరు పెట్టింది. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అమిత్‌షా పర్యటనపై అసహనం వ్యక్తం చేశారు. అమిత్‌షా ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.ఎవరూ సరిహద్దు వైపు చూసే సాహసం కూడా చేయలేరని తేల్చి చెప్పారు. మా సరిహద్దుపై కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేరు. గుండు సూది మందం ప్రాంతాన్ని కూడా ఆక్రమించలేరు. ఎవరైనా భారత్‌లోకి చొచ్చుకొచ్చే రోజులు పోయాయి. ఆర్మీ పగలనకా, రాత్రనకా కాపలా కాస్తోంది కాబట్టే ఇవాళ భారత దేశ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నారు."

## తెలంగాణా ప్రజలకు ప్రధాని, రాష్ట్రపతి శుభాకాంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. రాష్ట్ర ప్రజల నైపుణ్యం, సంస్కృతీ వైభవానికి ఎంతో విశేషమైన గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర శ్రేయస్సు, సౌభాగ్యం కోసం ప్రార్థిస్తున్నట్లు ఆయన తన ట్వీట్లో వెల్లడించారు.

# వైఎస్ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాండి-హై కోర్టు

(మొదటిపేజీ తరువాయి)

అరెస్ట్ చేయకుండా తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఇందు కోసం నాలుగు షరతులు పెట్టింది. పూచీకత్తులతో పాటు ప్రతి శనివారం విచారణకు హాజరు కావాలని.. చెప్పకుండా విదేశాలకు వెళ్లవద్దని షరతులు పెట్టింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు అయింది. అరెస్టు చేసినట్లు అయితే రూ. 5 లక్షల పూచీకత్తుతో బెయిల్‌పై విడుదలకు సీబీఐకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జూన్ నెలాఖరు వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. సీబీఐకి అవసరమైనప్పుడు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. అవినాష్ రెడ్డి సాక్ష్యాలను తుడిచేశారనేందుకు ఆధారాలు లేవన్న న్యాయమూర్తి అవినాష్ రెడ్డి దర్యాప్తులో కలగజేసుకున్నాంనేందుకు ఏ విధమైన ఆధారం లేదా ఆరోపణలు కూడా లేవని జస్టిస్ లక్ష్మణ్ తెలిపారు. సాక్ష్యాల్ని ధ్వంసం చేయడంలో కీలకపాత్ర పోషించినట్టుగా సీబీఐ అతనిపై అభియోగాలు మోపినా.వాటిని ఆన్ రికార్డ్ చేసేలా సీబీఐ రుజువు చేయలేకపోయిందని వెకేషన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో అవినాష్ రెడ్డికి కస్టోడియల్ విచారణ అవసరం లేదని భావిస్తూ బెయిల్ మంజూరు చేసింది. ప్రతి శనివారం సీబీఐ కార్యాలయానికి ఉదయం 10 గంటల్నించి సాయంత్రం 5 గంటల మధ్యలో అవినాష్ రెడ్డి వెళ్లాలని, సీబీఐ దర్యాప్తుకు సహకరించాలని కోర్టు షరతులు విధించింది. న్యాయపోరాటం చేస్తున్న వైఎస్ వివేకా కుమార్తె సునీత మరో వైపు తండ్రిని చంపిన వారికి శిక్ష పడేంత వరకూ వదిలి పెట్టబోనని న్యాయపోరాటం చేసేందుకు వైఎస్ సునీత సిద్ధమయ్యారు. గంగిరెడ్డి బెయిల్ పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఇప్పటికే సుప్రీంకోర్టులో సవాల్ చేసి..బెయిల్ రద్దు చేయించారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులోనూ వెకేషన్ బెంచ్ విచారణలు జరుగుతున్నందున .. సెలవులు అయిపోయిన తర్వాత అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ తీర్పును సునీత సుప్రీంకోర్టులో సవాల్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు

# ఆరు దశాబ్దాల అలుపెరుగని పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఎదగడం ఒక చారిత్రాత్మక విజయం.తెలంగాణ ఏయే రంగాలలో ధ్వంసం చేయబడిందో ఆ రంగాలన్నింటినీ మళ్లీ చక్కదిద్ది సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యతను ప్రభుత్వం నిజాయితీగా చేపట్టింది. సమైక్య పాలకులు అనుసరించిన వివక్షా పూరిత విధానాలను మార్చేయడానికి పూనుకున్నది. 'తెలంగాణను పునరన్వేషించుకోవాలి, తెలంగాణను పునర్నిర్మించుకోవాలి' అనే నినాదంతో ముందడుగు వేసింది.తెలంగాణ దృక్పథంతో నూతన విధానాలను రూపకల్పన చేసుకున్నది. తెలంగాణ ప్రజల తక్షణ అవసరాలు, వనరులు, వాస్తవాలు, అందుబాటులో ఉన్న పరిస్థితుల ఆధారంగా వివిధ చట్టాలు ప్రణాళికలు, మార్గదర్శకాలన్నింటినీ రూపొందించుకున్నాం.ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం నుంచే తెలంగాణ దోపిడీకి గురైందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. 1969లోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిందని, మలిదశ ఉద్యమంలో పాల్గొనే అవకాశం తనకు దక్కిందని చెప్పారు. ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారని వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన త్యాగమూర్తులకు నివాళులు అర్పించారు. ఒకసారి పోరాట చరిత్ర, అభివృద్ధి ప్రస్తానాన్ని తలచుకుందామని, భవిష్యత్తు పురోగమనానికి మహోన్నతమైన ప్రేరణగా మలుచుకుందామన్నారు.'తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల శుభసందర్భంలో ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. మనం స్వప్నించి, పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు దశాబ్ది ముంగిట నిలిచిన ఉజ్వల సందర్భంలో 60 ఏండ్ల పోరాట చరిత్రనీ, పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్నీ ఘనంగా తలుచుకుందాం. భవిష్యత్తు పురోగమనానికి మహోన్నతమైన ప్రేరణగా మలుచుకుందాం.ప్రజల అభీష్టానికి భిన్నంగా తెలంగాణను ఆంధ్రాప్రాంతంతో కలిపి 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ ప్రజలు తమ అసమ్మతిని నిరంతరం తెలియజేస్తూనే వచ్చారు. 1969లో ఎగిసిపడిన తెలంగాణ ఉద్యమం రక్తసిక్తమైంది, దారుణమైన అణచివేతకు గురైంది. 1971 లో జరిగిన ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణ డిమాండ్ కు మద్దతుగా ప్రజాతీర్పు వెలువడినప్పటికీ.. దానిని ఆనాటి కేంద్ర ప్రభుత్వం గౌరవించలేదు. ఫలితంగా తెలంగాణ సమాజంలో నాడు తీవ్ర నిరాశా నిస్పృహలు ఆవరించాయి. ఉద్యమాన్ని రగిలించేందుకు కొన్ని ప్రయత్నాలు జరిగినా.. నాయకత్వం మీద విశ్వాసం కలగకపోవడంవల్ల, సమైక్య పాలకుల కుట్రల వల్ల ఆ ప్రయత్నాలు ఫలించలేదు. 2001 వరకూ తెలంగాణలో నీరవ నిశ్శబ్దం రాజ్యమేలింది. 'ఇంకెక్కడి తెలంగాణ' అనే నిర్వేదం జనంలో అలుముకున్నది. ఆ నిర్వేదాన్ని, నిస్పృహని బద్దలు కొడుతూ 2001లో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆ ఉద్యమానికి నాయకత్వం వహించే చారిత్రాత్మక పాత్ర నాకు లభించినందుకు నా జీవితం ధన్యమైంది.

అహింసాయుతంగా.. శాంతియుత పంథాలో..

అహింసాయుతంగా, శాంతియుత పంథాలో వివేకం పునాదిగా, వ్యూహాత్మకంగా సాగిన మలిదశ ఉద్యమంలోకి క్రమక్రమంగా అన్ని వర్గాలు వచ్చి చేరాయి. ఈ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మేధావులూ, విద్యావంతులూ, ఉద్యోగ ఉపాధ్యాయులూ, కవులూ, కళాకారులూ, కార్మికులూ, కర్షకులూ, విద్యార్థులూ, మహిళలూ కులమత భేదాలకు అతీతంగా, సిద్ధాంతరాద్ధాంతాలకు తావివ్వకుండా ఏకోన్ముఖులై కదిలారు. వారందరికీ నేటి దశాబ్ది ఉత్సవ సందర్భంగా సవినయంగా తలవంచి నమస్కరిస్తున్నాను. స్వరాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన త్యాగధనులైన అమరులకు హృదయపూర్వకంగా నివాళు లర్పిస్తున్నాను. 2014లో అధికారంలోకి వచ్చిన నాటినుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అమరుల ఆశయాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనసా వాచా కర్మణా అంకితమైంది.

ప్రతిరంగంలోనూ యావద్దేశం నివ్వెరపోయే ఫలితాలను సాధిస్తూ ప్రగతిపథంలో పరుగులు పెడుతున్న తెలంగాణ నేడు పదో వసంతంలో అడుగు పెట్టడం ఒక మైలురాయి. ఈ సందర్భంగా స్వరాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. నేటినుంచి 21 రోజులపాటు ఈ ఉత్సవాలు వేడుకగా జరుగుతాయి. గ్రామస్థాయి నుంచి రాజధాని నగరం వరకూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనాలని కోరుతున్నాను.అటు పోరాటంలోనూ, ఇటు ప్రగతి ప్రయాణంలోనూ ప్రజలు ప్రదర్శించిన అపూర్వమైన స్ఫూర్తినీ, అమరుల ఆశయాలను తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో చేసిన కృషినీ మననం చేసుకుందాం. దేశానికి దిక్సూచిగా నిలిచిన తెలంగాణ ప్రగతిని దశదిశలా చాటుదాం. భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకుందామన్నారు.

ఆ ఉక్కు సంకల్పాన్ని ఏ క్షణమూ విస్మరించలేదు..

2014 జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేనొక వాగ్దానం చేశాను. తెలంగాణ రాష్ట్రాన్నిచూసి దేశం నేర్చుకొనే విధంగా, భారతదేశానికే తలమానికంగా ఉండే విధంగా తెలంగాణను తీర్చిదిద్దుతానని ఆనాడు నేను ప్రజలకు హామీ ఇచ్చాను. ఆ ఉక్కు సంకల్పాన్ని ఏ క్షణమూ విస్మరించలేదు. ఏమాత్రం చెదరనివ్వలేదు. తొమ్మిదేండ్ల అనతికాలంలోనే అనేక రంగాలలో మన తెలంగాణ దేశానికే స్ఫూర్తినిస్తున్న రాష్ట్రంగా అవతరించింది.తెలంగాణ ఉద్యమంలో ప్రజలు వ్యక్తం చేసిన ఆకాంక్షల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంపూర్ణమైన అవగాహన ఉంది. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వంవహించిన అనుభవం ప్రాతిపదికగా రాష్ట్ర ప్రజల ఆర్తిని ప్రతిబింబించే విధంగా మేనిఫెస్టోను రూపొందించుకొని చిత్తశుద్ధితో అమలు చేసింది.

ఇప్పుడిది నవీన తెలంగాణ..

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆనాటి పరిస్థితులను నేటి పరిస్థితులతో ఒకసారి బేరీజు వేసుకొని చూస్తే, మనం సాధించిన ఆశ్చర్యకరమైన విజయాలు మన కళ్ళ ముందు కదలాడుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ తొమ్మిదేళ్ళ వ్యవధిలో కరోనా మహమ్మారి వల్ల దాదాపు మూడేండ్ల కాలం వృథాగానే పోయింది. ఇక మిగిలిన ఆరేండ్ల స్వల్ప కాలంలోనే వాయువేగంతో రాష్ట్రం ప్రగతి శిఖరాలను అధిరోహించింది.ఇప్పుడు ఇది నవీన తెలంగాణ. నవనవోన్మేష తెలంగాణ. దేశంలో ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా తెలంగాణ మోడల్ అనే మాట మార్మోగుతున్నది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ అభివృద్ధి నమూనా మన్ననలందుకుంటున్నది. అనేక సవాళ్ళు, అవరోధాల మధ్య నెమ్మదిగా ప్రారంభమైన తెలంగాణ ప్రగతి ప్రస్థానం నేడు పరుగులు తీస్తోందంటే, అందుకు అంకితభావంతో పనిచేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, ప్రభుత్వోద్యోగులు, ప్రజా సహకారమే కారణమని సవినయంగా తెలియజేస్తున్నాను.

అభివృద్ధిని సాధించడమేకాదు, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడంలో కూడా మన రాష్ట్రం నూతన ఒరవడిని దిద్దింది. మానవీయకోణంలో రూపొందించిన పథకాల పట్ల నేడు దేశమంతటా ఆదరణ వ్యక్తమవుతున్నది. తెలంగాణ ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా ఆచరణీయంగా నిలవడమే కాదు, ఆయా రాష్ట్రాల ప్రజలు తమకు కూడా తెలంగాణ తరహా అభివృద్ధి కావాలని కోరుకుంటున్నారు. మన రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు మన పథకాలపట్ల ఆకర్షితులై, తమ రాష్ట్రాలలో కూడా వీటిని అమలు చేస్తామని ప్రకటించినప్పుడు మనకు ఎంతో గర్వంగానూ ఆనందంగానూ అనిపిస్తున్నది.' అని సీఎం కేసీఆర్ అన్నారు.

మిషన్ భగీరథ ద్వారా నూటికి నూరు శాతం గృహాలకు నల్లాల ద్వారా శుద్ధిచేసిన మంచినీటిని సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంటింటికీ నల్లాల ద్వారా శుద్ధిచేసిన నీరు ఇవ్వలేకపోతే.. బిందెడు నీళ్ల కోసం మహిళలు పడే కడగండ్లను నివారించకుంటే, తాను ప్రజలను ఓట్లు అడగనని రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే ప్రతిజ్ఞ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. తాను చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు.'దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమబెంగాల్ అట్టడుగు స్థానంలో ఉండగా.. ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రం గుజరాత్ మూడోస్థానంలో ఉంది. మనం ప్రారంభించిన మిషన్ భగీరథను అనుకరిస్తూ కేంద్రప్రభుత్వం 'హర్ ఘర్ జల్ యోజన' అనే పథకాన్ని అమలుచేస్తోంది. కానీ, అదింకా నూటికి నూరుశాతం లక్ష్యాన్ని చేరుకోలేదు' అని సీఎం అన్నారు.కేంద్ర జలశక్తి శాఖ పరిధిలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ భగీరథ నీటిని పరీక్షలు నిర్వహించి రూపొందించిన వాటర్ క్వాలిటీ ఇన్ఫర్మేషన్ నివేదిక ప్రకారం.. ఒక్క తెలంగాణలోనే 99.95 శాతం నల్లానీళ్లలో కలుషిత కారకాలు లేవని నిర్ధారించిందని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. నేషనల్ వాటర్ మిషన్ అవార్డు, జల్ జీవన్ అవార్డులతో సహా, పలు అవార్డులు, ప్రశంసలు మిషన్ భగీరథకు లభించాయని సీఎం కేసీఆర్ చెప్పారు. 'మిషన్ భగీరథ పథకంతో నేడు తాగునీటి కోసం ప్రజలు మండుటెండలో బిందెలు నెత్తిన పెట్టుకొని మైళ్ళకుమైళ్ళ దూరం నడిచే దృశ్యాలు లేవు. ఖాళీ బిందెలతో ప్రజల ధర్నాలు లేవు. ఫ్లోరైడ్ నీరు తాగడం వల్ల ఫ్లోరోసిస్ బారినపడి ప్రజలు వికలాంగులుగా మారిన దృశ్యాలు మచ్చుకు కూడా నేడు కానరావు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడా ఫ్లోరైడ్ బాధలు లేవన్నది కేంద్రంతో సహా అందరూ అంగీకరించిన వాస్తవం' అని సీఎం వివరించారు.

# ఈనెల నుంచే రోడ్లపైకి వారాహి

(మొదటిపేజీ తరువాయి)

వారాహి రూట్ మ్యాప్ వివరాలను వెల్లడించనున్నారు.

పవన్ కళ్యాణ్ త్వరలో చేపట్టే వారాహి యాత్రపై ఉభయ గోదావరి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పి.ఎ.సి. సభ్యులతో మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నాదెండ్ల మనోహర్ శుక్రవారం సమావేశమై చర్చించారు. పవన్ యాత్రకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని జనసేన శ్రేణులకు నాదెండ్ల సూచించారు. ఏపీలో ఎన్నికల ప్రచారం కోసం పవన్ కల్యాణ్ వారాహి వాహనం తయారుచేయించారు. ప్రచార వాహనం వారాహితో పవన్ ప్రజల్లోకి వెళ్తారని జనసేన నేతలు పలుమార్లు చెప్పారు. కానీ అందుకు అనువైన సమయంగా భావించి త్వరలోనే వారాహితో పవన్ కళ్యాణ్ ప్రజల్లోకి వెళ్లనుండటంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి జిల్లాలతోనే పవన్ వారాహి అందుబాటులోకి రానుందని తెలుస్తోంది.

# రెండు సరికొత్త రికార్డులను సాధించిన విశాఖ పోర్టు

(మొదటిపేజీ తరువాయి)

హ్యాండిల్ చేసింది. ఇప్పటి వరకు ఇదే ఒక నెలలో అత్యధిక కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసిన రికార్డుగా ఉంది. విశాఖపట్నం పోర్టు నూతన రికార్డులను సాధించటం పట్ల పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు.. పోర్టు సిబ్బందిని, టెర్మినల్ ఆపరేటర్ ను ప్రశంసించారు. పోర్టు సిబ్బంది కలిసికట్టుగా పని చేయటం ద్వారా మరిన్ని కొత్త రికార్డులను తిరగ రాయవచ్చని పోర్టు చైర్మన్ ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు.

# వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు సీఎం జగన్. ఆ రైతన్నలే గ్రూపు కింద మారి ఆర్బీకే పరిధిలో ఉన్నమిగిలిన రైతులకు కూడా యంత్రాలన్నీ అందుబాటులోకి తీసుకొస్తారని తెలిపారు. 10,444 ఆర్బీకేల పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ పరిధిలో రైతన్నలే ఈ వ్యవసాయ పనిముట్లన్నీ తక్కువ ధరకు అద్దెకు ఇస్తారని వివరించారు.

గ్రామ స్వరాజ్యం అనే పదానికి నిజమైన అర్థం చెప్పే కార్యక్రమం ఈరోజు జరుగుతోందన్నారు సీఎం జగన్. ఇంతకు ముందు 6,525 ఆర్బీకే స్థాయిలో 391 క్లస్టర్ స్థాయిలోనూ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు రైతుల పేరుతో ఓపెన్ చేశామన్నారు. అక్కడ 3,800 ట్రాక్టర్లను, 391 కంబైన్ హార్వెస్టర్లను, 22,580 ఇతర యంత్రాలను సప్లయ్ చేశామని గుర్తు చేశారు.

రైతులకు మంచి జరగాలని ఈరోజు(శుక్రవారం) 3,919 ఆర్బీకే స్థాయిలో మిగిలిన వంద క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు అన్నింట్లోనూ 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్ హార్వెస్టర్లతోపాటు 13,573 ఇతర యంత్రాలను అందుబాటులోకి ఉంచబోతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఆర్బీకే స్థాయిలో 15 లక్షల రూపాయలు కేటాయించి ఎటువంటి యంత్రాలు కావాలన్నా ఆ రైతుల్నే డిసైడ్ చేయాలని చెప్పారు. వరి బాగా పండుతున్న 491 క్లస్టర్ స్థాయిలో కంబైన్ హార్వెస్టర్ తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించినట్టు పేర్కొన్నారు. ఒక్కొక్క క్లస్టర్ స్థాయిలో ఒక్కో హార్వెస్టర్‌ను 25 లక్షల రూపాయలతో



అందుబాటులోకి తీసుకొచ్చా ంన్నారు. 1,052 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆర్బీకేల పరిధిలో ఇవన్నీ తీసుకొస్తున్నామని వివరించారు. గ్రూపులుగా ఫామ్ అయిన రైతులు కేవలం 10 శాతం కడితే చాలు.. 40 శాతం గవర్నమెంటే సబ్సిడీ కింద ఇచ్చి మిగిలిన 50 శాతం లోన్ల కింద ఆ ఆర్బీకే పరిధిలో వీటిని అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు. ఆర్బీకే స్థాయిలోనే ఏ రైతు అయినా వాడుకొనేందుకు అతి తక్కువ అద్దెతో ఇవన్నీ అందుబాటులో ఉండేందుకు వైఎస్సార్ యంత్ర సేవా యాప్‌ను కూడా తీసుకొస్తున్నామన్నారు జగన్. వీటి వల్ల 15 రోజులు ముందుగానే బుక్ చేసుకోవచ్చన్నారు. ఆర్బీకే పరిధిలో ఉన్న ప్రతి రైతన్న కూడా దీన్ని ఉపయోగించుకొనే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు.

ఈ సంవత్సరం అక్టోబర్‌లో 7 లక్షల మంది రైతన్నలకు మంచి జరిగేలా వ్యవసాయ పనిముట్లను, వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు అందజేస్తామన్నారు. స్ప్రేయర్లు, టార్పాలిన్లు ఇలాంటివి పంపిణీ చేయబోతున్నట్టు ప్రకటించారు. అర్బీకే వ్యవస్థను పటిష్ట పరుస్తూ రైతన్నలకు మంచి జరిగాలనే అడుగులు పడుతున్నాయన్నారు.

# మరో పక్కా ప్లాన్ తో వైసీపీ

## గెలుపే లక్ష్యంగా అడుగులు

**విజయవాడ :**

ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐపాక్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ జనరల్ కౌన్సిల్‌లో ముఖ్యమంత్రి పాల్గొన్న తర్వాత ఈ సమావేశం జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. 2019 ఎన్నికల తర్వాత కూడా ఏపీలో ఐపీఏసీ సీఎం జగన్‌తో కలిసి పనిచేస్తోంది. ఎఖంఅ నుంచి వైదొలిగినట్లు ప్రశాంత్ చెప్పినప్పటికీ.. అతను తన బృందాలకు మార్గనిర్దేశం చేస్తున్నారని సమాచారం. ఏపీలోని ఎఖంఅ బృందం మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంది. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేను తప్పిస్తే ప్రతి ఎమ్మెల్యేపైనా సొంతంగా అంచనా వేసి ప్రత్యామ్నాయ పేర్లను సూచించినట్లుగా సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో క్రమంగా పుంజుకుంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దానికి సంబంధించిన నివేదికల నేపథ్యంలో పార్టీని పటిష్టం చేసేందుకు ఐ-ప్యాక్‌ని వరుసగా రెండోసారి నియమించుకోవాలని వైసీపీ నిర్ణయించింది. ప్రశాంత్‌తో జగన్ ఈ నివేదికలను పంచుకున్నారని, 2024 ఎన్నికలకు కొత్త వాగ్దానాలు చేయాల్సిన అవసరం లేదని, తన నవరత్నాలతో ప్రజల్లోకి వెళ్లాలని ఎన్నికల వ్యూహకర్త పీకే సీఎంకు సూచించారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. జగన్ తన పని తీరును బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో తమ ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని పీకే సూచించినట్లుగా సమాచారం. వచ్చే ఎన్నికల్లో కనీసం 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను బరిలోకి దించి కొత్త ముఖాలను తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసే 175 మంది అభ్యర్థులపై సీఎం ప్రశాంత్ కిషోర్ సమీక్ష జరిపినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను భర్తీ చేయాలని నెల రోజుల క్రితం నిర్ణయం తీసుకోగా.. టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిని కిషోర్, అతని ఐపాక్ బృందం కోరిక మేరకు మార్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో టెక్కలి అభ్యర్థిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను జగన్ ప్రకటించినప్పటికీ.. గత వారం ఆయనను తప్పించి, టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు అయిన ఆయన భార్య వాణిని అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా నిలబెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక.. మె?దటి ఎన్నికల్లో విజయం సాధించి 2014 లో చంద్రబాబు నాయుడు పీఠమెక్కారు. రెండోసారి 2019 ఎన్నికల్లోనూ చంద్రబాబుకే పట్టం కడుతారని చాలామంది అభిప్రాయపడ్డారు. కానీ అంతా రివర్స్ అయ్యింది. అనూహ్యంగా ఎవరూ ఊహించని రీతిలో.. భారీ మెజారిటీతో జగన్.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. జగన్ చరిష్మాతోపాటు.. ఆయన కోసం పని చేసిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ దీని వెనుక ఉన్న సంగతి తెలిసిందే. వెనకాలే ఉంటూ.. ఎన్నికలకు ముందు నుంచే.. ఎలా ప్రణాళికతో వెళ్లాలనే అంశాలపై జగన్ ను గైడ్ చేశారు పీకే. మళ్లీ ఇప్పుడు ఆ సీన్ రిపిట్ చేయాలని సీఎం జగన్ అనుకుంటున్నారు. అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్) సేవలను వరుసగా రెండోసారి ఉపయోగించుకునేందుకు నియమించుకున్నట్టుగా సమాచారం. మళ్లీ పీకే బృందంతో ఒప్పందం కుదిరినట్టుగా తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఐ ప్యాక్ పక్కా ప్లాన్ తో వర్క్ చేసింది. 175 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో 151 సీట్లు, 25 లోక్‌సభ స్థానాలకు గానూ 22 సీట్లు గెలుచుకునేలా చేయడంలో పీకే మైండ్ గేమ్ కూడా ఉంది. మళ్లీ ఐ-ప్యాక్ పార్టీ కోసం పని చేయనుంది. 2024 ఎన్నికల్లో జగన్ ను గెలిపించేందుకు ప్రణాళికలు వేస్తోందిగతంలో జరిగినట్టు ప్రశాంత్ కిషోర్ ఈసారి ఏపీలో వైఎస్సార్‌సీపీతో నేరుగా రంగంలోకి దిగడు. కిషోర్ సహోద్యోగి, ఐ-ప్యాక్ డైరెక్టర్, సహ వ్యవస్థాపకుడు రిషి రాజ్ సింగ్ నేతృత్వంలోని బృందం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పని చేస్తుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న రెండు పార్టీలూ ఐ-ప్యాక్‌ని నియమించుకున్నాయి. 2023లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి పని చేసేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్.. ఇప్పటికే ఐ ప్యాక్ తో డీల్ కుదుర్చుకున్నారు. టీఆర్ఎస్‌తో ఇప్పటికే దీనికి సంబంధించిన చర్చలు కూడా పూర్తయినట్టుగా తెలుస్తోంది. ఈ ఏడాది మార్చిలో పీకే, కేసీఆర్ వరుస సమావేశాలు నిర్వహించారు. తరువాత టీఆర్ఎస్ కోసం, కేసీఆర్ జాతీయ రాజకీయాలకు సంబంధించి పీకే ఐ ప్యాక్ పని చేస్తోందని తెలుస్తోంది. మంత్రి కేటీఆర్ కూడా ఐ-ప్యాక్‌తో ఒప్పందం చేసుకున్నట్లు ధృవీకరించిన సంగతి తెలిసిందే.

# నల్లారికి కమలం పగ్గాలు

**హైదరాబాద్ :**



ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.. తండ్రి నుంచి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు. మూడున్నర దశాబ్దాల పాటు కాంగ్రెస్ లో కీలక పదవులు అనుభవించారు. రాష్ట్ర విభజనకు ముందు ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన అధిష్ఠానాన్ని ధిక్కరించి కాంగ్రెస్ ను వీడి సమైక్యాంధ్ర పార్టీని స్థాపించారు. 2014లో ఆ పార్టీ తరపున అభ్యర్థులను నిలిపారు. సీన్ కట్ చేస్తే సమైక్యాంధ్ర పార్టీ 2014 ఎన్నికలలో చిత్తుగా ఓడిపోయింది. పార్టీ అధినేత కిరణ్ కుమార్ రెడ్డి సహా ఆ పార్టీ తరపున పోటీ చేసిన ఎవరికీ కనీసం డిపాజిట్ కూడా రాలేదు. దీంతో అప్పటి నుంచి ఆయన నాలుగేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే కాంగ్రెస్ పిలుపుతో ఆయన మళ్లీ సొంత గూటికి చేరారు. అయినా కూడా మౌనం వీడలేదు. ఇక అయన రాజకీయాలకు దూరమైనట్లేనని అంతా అనుకుంటున్న సమయంలో ఆయన మరోసారి కాంగ్రెస్ కు రాజీనామా చేసి కమలం గూటికి చేరారు. ఆయన బీజేపీ తరఫున కర్నాటకలో ప్రచారం కూడా చేశారు. అయితే కర్నాటక ఎన్నికలలో బీజేపీ పరాజయం పాలైంది. మళ్లీ షరామామూలే. కిరణ్ కుమార్ రెడ్డి మరోసారి మౌనముద్ర వహించి అమెరికా పర్యటనకు వెళ్లారు. అది వ్యక్తిగత పర్యటన అంటూ ఆయన త్వరలోనూ తిరిగి వచ్చి బీజేపీలో చురుకుగా వ్యవహరిస్తానని కిరణ్ కుమార్ రెడ్డి అక్కడ నుంచే ఓ ప్రకటన విడుదల చేశారు. అంతే తప్ప రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల గురించి కానీ, ఏపీలో అధికారంలో ఉన్న జగన్ సర్కార్ తీరుపై కానీ, విపక్ష తెలుగుదేశం కార్యక్రమాల గురించి కానీ ఎక్కడా మాట్లాడిన దాఖలాలు లేవు. అయితే ఏపీలో బీజేపీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని చెబుతున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సీనియర్ నాయకుడైన కిరణ్ కుమార్ రెడ్డి నుంచి సూచనలూ, సలహాలూ స్వీకరించేందుకే కలిసినట్లు సోము వీర్రాజు చెప్పుకున్నారు. అదలా ఉంచితే.. ఏపీలో బలోపేతం అయ్యేందుకు బీజేపీ గత కొంత కాలంగా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో కాపు సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు రాష్ట్ర పార్టీ పగ్గాలను తొలుత కన్నా లక్ష్మీనారాయణకు, ఆయన తరువాత సోము వీర్రాజుకు అప్పగించినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో సోము స్థానంలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి పార్టీ పగ్గాలు అప్పగించాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవలి కాలంలో బీజేపీ రాష్ట్ర నాయకులే కాకుండా పార్టీ జాతీయ స్థాయి నాయకులు కూడా జగన్ సర్కార్ పై విమర్శల దాడి పెంచడం, ఎక్కడికక్కడ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ లు విడుదల చేయడం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో నల్లారికి పార్టీ పగ్గాలు అప్పగిస్తే రాష్ట్రంలో వైసీసీకి అండగా ఉన్న రెడ్డి సామాజిక వర్గం ఓట్లు చీల్చే అవకాశం ఉంటుందన్నది బీజేపీ వ్యూహంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# ఇక ఏపీలో ముందస్తు నగారా?

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముందస్తు ఎన్నికలకు డిసైడైపోయారా? ఆయన తాజా హస్తిన పర్యటనలో ఈ విషయంపై కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ పొందారా అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. అందుకు తార్కానంగా ఆయన హస్తిన నుంచే కేబినెట్ భేటీకి ఏర్పాట్లు చేయాల్సిందిగా ఇచ్చిన ఆదేశాలను చెబుతున్నారు వచ్చే నెల 7న కేబినెట్ భేటీకి ఏర్పాట్లు చేయాలన్నదే ఆ సందేశం. ఆ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకుంటామని కూడా జగన్ చెప్పారని అంటున్నారు. ఇప్పటికిప్పుడు ఆయన తీసుకోబోయే కీలక నిర్ణయం ముందస్తేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తెలుగుదేశం దూకుడు ను నిలువరించాలంటే.. ఆ పార్టీ మరింత పుంజుకోకుండా ఆపాలంటే ముందస్తు ఒక్కటే మార్గమన్నది వైసీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశంగా వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని వర్గాలలో వైసీపీ పాలన పట్ల.. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే జగన్ పాలన పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. అందుకు తాజా తార్కానం అమరావతి ఆర్5 జోన్ లో పట్టాల పంపిణీకి బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసి.. వేల మందికి పట్టాలు పంపిణీ చేపట్టినా.. ఆ సభలో జగన్ ప్రసంగం ప్రారంభించగానే జనం మూకుమ్మడిగా లేచి వెళ్లిపోవడాన్ని చూపుతున్నారు. ఇప్పటికే ఏపీలో ఎన్నికల హీట్ రోహిణి కార్తె ఎండలను మించిపోయింది. ఏపీ సీఎం ముందస్తు ముచ్చటే లేదని స్పష్టం చేసినా ఆయన మాటలను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరు. నవంబర్‌లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల షెడ్యూల్ రావాల్సి ఉంది. అసెంబ్లీల గడువు పూర్తయ్యే రాష్ట్రాల్లో ఈసీ ఇప్పటికే సన్నాహాలు ఆరంభించింది. ధృవపడని సమాచారం మేరకు పనిలో పనిగా ఏపీలో కూడా ఈసీ ఎన్నికల సన్నాహాలు ఆరంభించింది. అయినా ఏపీలో కూడా ఎన్నికలు జరగాలంటే.. ఎ ఆ ఐదు రాష్ట్రాలతో కలిపి ఈసీ ఏపీలో కూడా ముందస్తు ఎన్నికలు నిర్వహించాలంటే? ఇక జాగు లేకుండా జగన్ అసెంబ్లీని రద్దు చేయాల్సి ఉంటుంది. అదిగో ఆ నిర్ణయం తీసుకునేందుకే జగన్ వచ్చే నెల 7న కేబినెట్ బేటీ ఏర్పాటు చేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆ విశ్లేషణలకు హేతువు మాత్రం ముఖ్యమంత్రి జగన్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల, మంత్రులు సమయం సందర్భంతో పని లేకుండా ముందస్తు ప్రశక్తే లేదన్న ప్రకటనలు గుప్పించడమేనంటున్నారు. ముందస్తుకు వైసీపీ తొందర ఎందుకంటే.. రాష్ట్రంలో జగన్ సర్కార్ సంక్షేమ పథకాల కొనసాగింపు పెద్ద క్వశ్చన్ మార్క్ గా మారింది. ఆర్థిక పరిస్థితులు కారణంగా ఆ పథకాలు నిలిచిపోయే పరిస్థితి ఉంది. అదే జరిగితే.. ప్రభుత్వ ప్రతిష్ట మరింత దిగజారి మొదటికే మోసం వస్తుంది. ఈ ఆలోచనతోనే జగన్ ముందస్తు మంత్రం జపిస్తున్నారని పరిశీలకులు అంటున్నారు. ఇందుకు కేంద్రం నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చేసిందనీ, సహకారం అందిస్తామన్న హామీ కూడా జగన్ కు లభించిందని అంటున్నారు. అందుకే ఏళ్ల తరబడి పైసా విదల్చడానికి కూడా ఇష్టపడని కేంద్రం ఒక్క సారిగా ఉరుములేని పిడుగులా.. జగన్ సర్కార్ పై అవాజ్యమైన ప్రేమానురాగాలు ప్రదర్శిస్తూ రెవెన్యూ లోటు నిధులను పది వేల కోట్ల రూపాయలకు పై చిలుకు ఒకే సారి విడుదల చేసిందని అంటున్నారు. ముందస్తు సన్నాహాలకు, బకాయిల చెల్లింపులకు ఈ నిధులు రాష్ట్రానికి ఉపకరిస్తాయన్న యోచనతోనే ఆ విడుదల జరిగిందనీ, లేకుంటే గత ప్రభుత్వం రెవెన్యూలోటు భర్తీ గురించి అడినప్పుడల్లా దేశ రక్షణ నిధులివ్వమంటారా అంటూ ఒంటి కాలిమీద లేచిన కేంద్రంలోని మోడీ సర్కార్ ఇప్పుడు హఠాత్తుగా అంత సొమ్ము ఒకేసారి ఎందుకు విడుదల చేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా జగన్ సర్కార్ ముందస్తుకు వెడుతుందా? లేదా? అన్నది జూన్ 7న జరిగే కేబినెట్ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఆదాయంలో సౌత్ సెంట్రల్ రైల్వే టాప్

**హైదరాబాద్ :**

దక్షిణ మధ్య రైల్వే 2023 మే నెలకుగాను ప్రయాణికులు, సరుకు రవాణా విభాగంలో వసూళ్లలో సరికొత్త రికార్డు సృష్టించింది. జోన్ మొదటి సారిగా నెలవారీ ప్రయాణీకుల ఆదాయంలో రూ. 500 కోట్ల మార్కును అధిగమించింది. ప్రయాణికుల ఆదాయం మే నెలలో రూ. 513.41 కోట్లు ఆర్జించింది. ఏప్రిల్ నెలలలో రూ. 467.82 కోట్లు రాబట్టింది. ఇక సరకుల రవాణా విషయంలోనూ మునుపెన్నడూ లేని విధంగా లాభాలు ఆర్జించింది. మే నెలలో 12.517 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేపట్టడం జరిగింది. ఇక దక్షిణ మధ్య రైల్వే 2023 మే నెలలో 26.11 మిలియన్ల మంది ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేరవేసింది. గత 2022 మే నెలలో 21.12 మిలియన్ల ప్రయాణికులతో పోలిస్తే 24% వృద్ధిని సాధించింది. సాధారణ రైళ్లు కాకుండా వేసవి కాలంలో అదనపు రద్దీ అవసరాలను తీర్చడానికి మే నెలలో జోన్ 538 ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడిపింది. ఇది అదనంగా 4.65 లక్షల మంది ప్రయాణీకులను రవాణా చేయడం ద్వారా రూ. 36.52 కోట్ల ఆదాయం సంపాదించింది. సరుకు రవాణా విభాగంలో మే 2023లో 12.517 ఎమ్‌టిలు సరుకును రవాణా చేసింది, ఇది ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా ఒక నెలలో సాధించిన అత్యుత్తమ సరుకు రవాణా లోడింగ్. గత సంవత్సరం నమోదైన సంబంధిత లోడింగ్ కంటే ఇది దాదాపు 7% ఎక్కువ. అదే సమయంలో, సరుకు రవాణా ఆదాయం ఈ ఏడాదిలో 14% వృద్ధి చెంది రూ. మే, 2023లో రూ .1213.36 కోట్లు నమోదు చేసింది. గత ఏడాది మే, 2022 లో 1065.15 కోట్లు నమోదు చేసింది. దక్షిణ మధ్య రైల్వే మొత్తం సరుకు రవాణాలో సిమెంట్ (3.106 ఎమ్ టిలు), ఆహార ధాన్యాలు (0.444 ఎమ్ టిలు), ఎరువులు (0.740 ఎమ్ టిలు), ఇనుప ఖనిజం (0.363 ఎమ్ టిలు), కంటైనర్లు (0.211 ఎమ్ టిలు) ప్రథమ స్థానంలో నిలిచాయి. దక్షిణ మధ్య సాధించిన ఈ విజయం పట్ల జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ సంతోషం వ్యక్తం చేశారు. ఆపరేటింగ్,వ కమర్షియల్ టీంలను అభినందించారు. జోన్లో ప్రతి నెల ఉత్తమ పనితీరు నమోదవుతున్న తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఎస్సీ వర్గీకరణ చట్టబద్దత సాధన కై జూన్ 5న మహాసభ

**-హాజరు కానున్న సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ**

**-మహాసభ విజయవంతానికై ఉద్యమ శ్రేణులు తరలిరావాలి**

**-ఎమ్మెస్పీ జిల్లా ఇంఛార్జి మంథని సామ్యేల్ మాదిగ**

**మంథని**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్దత సాధన కై జూన్ 5న కరీంనగర్ లో ఉమ్మడి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని ఈ సమావేశానికి సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని ఎమ్మెస్పీ జిల్లా ఇంఛార్జి మంథని సామ్యేల్ మాదిగ తెలిపారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించి కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జిల్లా ఇంఛార్జి మంథని సామ్యేల్ మాదిగ మాట్లాడుతూ స్వతంత్ర భారత చరిత్రలో తమహక్కులు సాధించుకునే యుద్ధభూమిలో పట్టు విడవకుండా రాజీపడకుండా 29సం, రాలు గా పోరాడుతున్న చరిత్ర మాదిగ మాదిగ ఉపకులాల కే ఉన్నదన్నారు. రాజ్యాంగ ఫలాలుగా అందుతున్న ఎస్సీ రిజర్వేషన్లు ఎస్సీ లలో ఉన్న అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికన అందించబడాలనేదే డా,బీ ఆర్ అంబేద్కర్ ఆశయం అని పేర్కొన్నారు. ఈ సామాజిక న్యాయ సూత్రానికి కట్టుబడి 29సం,రాలు గా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన అనేక సామాజిక ఉద్యమాలు అనేక విజయాలు సాధించి పెట్టడం కూడా జరిగిందని, అందులో ప్రధానంగా మాదిగ లకు గుర్తింపు గౌరవంసాధించడం, గతంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారా 25వేల ఉద్యోగాలు సాధించడం, ఎస్సీ ఉద్యోగులకు ప్రమోషన్ ల్లో రిజర్వేషన్లు సాధించడం, ఎస్సీ ఉపకులాలకు కులధృవీకరణ పత్రాలు ఎమ్మార్వోలు ఇచ్చే విధంగా చేయడం, గుండె జబ్బుపిల్లల ఉచిత ఆపరేషన్లు, వికలాంగుల,వృద్దులు వితంతు పెన్షన్లు పెంపు లాంటి విజయాలు సాధించిన ఉద్యమాలు మచ్చుకు కొన్ని మాత్రమేనని అన్నారు. ఇలాంటి సామాజిక నేపథ్యం గల ఉద్యమం 29సంవత్సరాలుగా పోరాడుతున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మాత్రం పాలకుల నిర్లక్ష్యం, మోసం, కారణంగా చట్ట బద్దతకు నోచుకోలేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధి కి పునాది, జాతి సామాజిక ఆర్థిక రాజకీయ ఎదుగుదలకు ఆయువు పట్టు కనుక



ప్రస్తుత పాలకుల మెడలు వంచి సాధించుకునే విధంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అందుకు గాను జూన్ 5న కరీంనగర్ ఉమ్మడి జిల్లా మహాసభకు తరలిరావాలని మాదిగ మాదిగ ఉపకులాలకు, వర్గీకరణ ను కోరుకునే సామాజిక వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మంథని చందు మాదిగ, ఆవునూరి లింగమూర్తి, మండల అధికారప్రతినిధి మంథని, లింగయ్య, టౌన్ అధ్యక్షులు సింగారపు అశోక్, నాయకులు సింగారపు సుధాకర్, చిప్పకుర్తి చందు ప్రసాద్ విద్యార్థి నాయకులు మంథని రామకృష్ణ,అన్విత్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల ధరలకు రెక్కలు

**విజయవాడ :**

ఏపీలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. స్పెషల్ రివిజన్ పేరుతో భూముల మార్కెట్ విలువను పెంచుతూ ఆంధ్రప్రదేశ్ సర్కార్ తీసుకున్న నిర్ణయం గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. అందుకనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి నిన్నటిదాకా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు పరుగులు తీశారు. అన్ని ప్రాంతాల్లో భూముల ధరలతో పాటు నిర్మాణాల రిజిస్ట్రేషన్ రేట్లు కూడా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో కొన్ని అర్బన్, రూరల్ ఏరియాల్లో మాత్రమే భూముల ధరలు, నిర్మాణాల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగాయి. చాలా చోట్ల 29 నుంచి 31 శాతం మేర ధరలు పెంచారు. ఆయా జిల్లాల జేసీలు స్థానిక డిమాండ్ ని బట్టి రేట్ల ధరను నిర్ణయించారు. భూముల ధరలతో పాటు భవనాలు,ఇతర నిర్మాణాల రిజిస్ట్రేషన్ ధరలు కూడా పెంచారు. విశాఖ విషయానికి వస్తే అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రాంతాల్లో భూముల విలువ పెరిగింది. అత్యధికంగా స్థిరాస్తి లావాదేవీలు జరుగుతున్న ప్రాంతాల్లో మాత్రమే భూముల మార్కెట్ విలువను పెంచినట్టు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో 20 శాతం నుంచి 100 శాతం వరకు స్థిరాస్తి విలువను పెంచుతూ చేసిన సవరణలు ఇవాల్టి నుంచి అమల్లోకి వచ్చాయి. భూముల విలువతో పాటు ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ ధరలను కూడా పెంచారు. అపార్ట్‌మెంట్లలో ాఈఖ రేటును 20 నుంచి 25 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ రేట్లను బహుళ అంతస్తుల నిర్మాణాలు సాగుతున్న ఎండాడ, మధురవాడ, కొమ్మాది, పెందుర్తి, అగనంపూడి వంటి ప్రాంతాల్లో అమలు చేస్తున్నారు. ఇక రాయలసీమ జిల్లాల్లో 25 నుంచి 35 శాతం వరకు భూముల మార్కెట్ విలువ పెరిగింది. అర్బన్ ఏరియాలతో పాటు వాటికి దగ్గరగా ఉండి అభివృద్ధి జరుగుతున్న రూరల్ ఏరియాల్లో భూముల విలువను పెంచారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఆదాయం వచ్చే 20 శాతం గ్రామాల పరిధిలోనే భూముల విలువను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

## బాలినేని శాంతించినట్టేనా

**ఒంగోలు :**

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి .. వైఎస్ఆర్‌సీపీ అధినేత, సీఎం జగన్మోహన్ రెడ్డితో భేటీ అయ్యారు. తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత బాలినేని శ్రీనివాసరెడ్డికి రీజనల్ కోఆర్డినేటర్ పదవి ఇచ్చారు. అయితే ఆ తర్వాత కనీసం ప్రోటోకాల్ కూడా ఇవ్వకపోతూండటంతో అసంతృప్తికి గుర్యయారు. తన పదవికి రాజీనామా చేశారు. గతంలో జగన్ పిలించి .. రీజినల్ కోఆర్డినేటర్ గా కొనసాగాలని కోరారు. కానీ బాలినేని మాత్రం అంగీకిరంచలేదు. తన నియోజకవర్గానికే పరిమితమవుతానని ప్రకటించారు. అనూహ్యంగా మరోసారి సీఎం జగన్మోహన్ రెడ్డి పిలవడంతో... జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని రీజినల్ కోఆర్డినేటర్ గా మళ్లీ పని చేయాలని సూచించేందుకన్న ప్రచారం జరిగింది.



అయితే సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడిన బాలినేని శ్రీనివాసరెడ్డి.. రీజినల్ కోఆర్డినేటర్ పదవులపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా రాజకీయాలపై అన్ని విషయాలను సీఎం జగన్‌తో చర్చించానన్నారు. జిల్లాలో ఇద్దరి విషయంలో మాత్రం ఇబ్బంది ఉందని.. ఆ ఇద్దరి గురించి జగన్ తో చర్చించాన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాని నియోజకవర్గంలో పని చేసుకోవాలని సూచించారన్నారు. జిల్లాలో తాను ఎదుర్కొంటున్నా ఇబ్బందుల పై కూడా సీఎం కి వివరించానని.. ప్రోటోకాల్ అనేది పెద్ద విషయం కాదన్నారు. ప్రోటోకాల్ పై ఫిర్యాదు చేయడానికి ఏముంటుందని వ్యాఖ్యానించారు. కొత్తగా రీజినల్ కోఆర్డినేటర్ పదవి కూడా చర్చ జరగలేదు. ..గతంలోనే ఆ పదవి వద్దని రాజీనామా చేశా.. నియోజకవర్గ మిడ్ దృష్టి పెట్టమన్నారని తెలిపారు నియోజకవర్గ అభివృద్ధి పనులకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు పార్టీ మార్పు అనేది ప్రచారం మాత్రమేనని అందులో ఎలాంటి నిజం లేదని బాలినేని స్పష్టం చేశారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వైసీపీకి ఇబ్బందికర పరిణామాలు ఎదురవుతున్నాయి. నెల్లూరులో ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు జంప్ అయ్యారు, చిత్తూరు, కడపలో కూడా పరిస్థితి పూర్తి స్థాయిలో సానుకూలంగా ఉందని చెప్పలేం. కుప్పంని కూడా టార్గెట్ చేసి చిత్తూరులో క్లీన్ స్వీప్ చేయాలనుకుంటున్న జగన్, అక్కడ ఇన్ చార్జ్ కాస్త గట్టిగా పని చేయాలనుకుంటున్నారు. ఇటీవల ఆ మూడు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలిచింది. దీంతో జగన్ మరింత కేర్ తీసుకోవాల నుకుంటున్నారు. విజయ సాయికి ఆ బాధ్యతలు అప్పగించ బోతున్నారు.

## రక్షణ లేని పురావస్తు శాఖ సంపద

**విజయనగరం:**

పురావస్తుశాఖ పరిధిలోని చారిత్రక సంపదకు రక్షణ లేకుండాపోతోంది. సరుబుజ్జిలి మండలం రొట్టవలస గ్రామ దంతపురి కోటగట్టుపై అక్రమ తవ్వకాలు యథేచ్ఛ సాగుతున్నాయి. కోటకు రక్షణగా నలుదిశలా విస్తరించి ఉన్న గట్టును ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఏకంగా యంత్రాలు పెట్టి గట్టును తవ్వకం చేసి మట్టిని తరలించుకుపోతున్నారని చెబుతున్నారు. మరికొంతమంది గట్టును తవ్వేసి పొలాలుగా మార్చి వాటిపై పంటలు పండిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ నుంచి సుమారు 8 కిలో మీటర్ల దూరంలో రొట్టవలస, కొండ వలస, పెద్దపాలెం, పాలవలస, రావివలస గ్రామాల మధ్య విస్తరించిన చారిత్రక స్థలం దంతపురి. క్రీ.పూ 261లో అశోకచక్రవర్తి జరిపిన కళింగ యుద్ధ తర్వాత ఈ క్షేత్రం ప్రాచుర్యంలోకి వచ్చింది. చేది వంశానికి రాజైన కళింగ ఖారవేలుని కాలంలో ప్రాముఖ్యత సంతరించుకుంది. కళింగ రాజుల రాజధానిగా దంతపురికి విశిష్ట స్థానం ఉంది. శ్రీలంకకు చెందిన మహా వంశం అనే బౌద్ధ గ్రంథంలో జంబూద్వీపానికి సప్తనగరాల్లో దంతపురి ప్రముఖమైనదిగా పేర్కొన్నారు. సింహ బాహు అనే రాజు సింహపురం పట్టణాన్ని నిర్మించి బుద్ధుని జ్ఞానదంతంపై స్థూపాన్ని నిర్మించడం వల్ల దంతపురిగా వెలసినట్లు ఆధారాలు చెబుతున్నాయి. రాష్ట్ర పురావస్తు శాఖవ ఆధ్వర్యంలో 30 ఏళ్ల క్రితం చేపట్టిన తవ్వకాల్లో దంతపురి ఆనవాళ్లు బయట పడ్డాయి. ఇక్కడి కోటలో 30 అడుగుల ఎత్తయిన ప్రాకారాలు, కోటకు నలు దిక్కులా ద్వారాలు ఉండేవని గుర్తించారు. అప్పట్లో మూడు స్థూపాలు, గుర్తుపట్టలేని పాతతరం విగ్రహాలు, స్నానపు గదులు, నీటిని నిల్వ చేసే జార్లు, ఫ్లవర్ వాజులు, వంటపాత్రలు, దీపాలు, భోజనపు గిన్నెలు, రాతిరుబ్బురోలు, ఎముకతో చేసిన దువ్వెనలు, టెర్రకోట వస్తువులు బయటపడ్డాయి. ఇంతటి చారిత్రక నేపథ్యమున్న ఇక్కడి బౌద్ధ స్థూపాలు ఇతర ఆనవాళ్లకు రక్షణ కరువైనా పట్టించుకునే వారే కరువ య్యారు. ఇప్పటికే బుద్ధుడి విగ్రహం ప్లాట్‌ఫాం శిథిలావస్థకు చేరుకుంది. ఎటువంటి ప్రహరీ సౌకర్యం లేక పోవడంతో ఆవరణలోనే మందు బాబులు హల్‌చల్ చేస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దంతపురి కోటగట్టు ప్రదేశాన్ని రీసర్వే చేసి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బానిసగా మారింది

**కుటుంబ జోక్యం లేని ప్రజాపాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నరు**

**గోల్కొండలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**

**హైదరాబాద్**

తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బానిసగా మారిందన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. గోల్కొండ కోటలో జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలను కిషన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సత్కరించి, వారికి పాదాభివందనం చేశారు. మరికొన్ని రోజుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు అమరవీరుల కుటుంబాల దగ్గరికి వెళ్లి వారితో మాట్లాడి కావాల్సిన సాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అవినీతి పెరిపోయిందన్నారు. ఏ ఒక్క కుటుంబం, ఏ ఒక్క పార్టీతోనే తెలంగాణ రాలేదు.. యావత్తు తెలంగాణ ప్రజలు సంఘటితంగా పోరాటం చేస్తే వచ్చింది. తులంగాణ ఏర్పాటు సమయంలో కూడా బీజేపీ అన్ని రకాలుగా సహకరించింది. తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బానిసగా తయారైంది. రాష్ట్రంలో అవినీతి పెరిగి పోయింది.

ప్రశ్నించే గొంతుకలైన జర్నలిస్టులు, ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలపై ఎందుకు అక్రమ కేసులు పెడుతున్నారో చెప్పాలి. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి, అరాచక శక్తులను పెంచి పోషించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఫీజు రియింబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. ఆరోగ్యశ్రీ అటకెక్కింది. బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్లు ఎటుపోయాయి? తెలంగాణ వచ్చాక ఏమున్నది గర్వకారణం.. అన్ని రంగాల్లో అవినీతి, అహంకారం, నియం తృత్వం, దుర్మార్గం, కుటుంబ పాలన. తెలంగాణ నగరాలను ఇస్తాంబుల్ చేస్తాం, సింగపూర్, డాలస్ చేస్తామని చెప్పారు.. కానీ కనీస సౌకర్యాలు లేక నగర ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నిమ్స్ లాంటి హాస్పిటల్స్ కడతామన్నారు.. ఏమైంది? ఉస్మానియాకు తాళం వేశారు.. ఉస్మానియాలోకి మూసీ వరద నీళ్లు వస్తున్నాయి. హాస్టల్ విద్యార్థులకు పురుగుల అన్నం, నీళ్ల చారు, ఫుడ్ పాయిన్ కేసులతో హాస్పిటళ్ల పాలవుతున్నారు. సెక్రటేరియట్లోకి, ప్రగతిభవన్లోకి ప్రజలు వెళ్లడానికి అవకాశం లేదు. ప్రజలకు అనుమతి లేని ఈ నిర్మాణాలు ఎందుకోసం? ధాన్యం కొనుగోళ్లలో రైతులు అనేక ఇబ్బంది పడుతున్నారు. కౌలు రైతులకు ఎలాంటి సాయం లేదు. అమరవీరుల కుటుంబాలు గోస పడుతున్నాయి. ఆదాయానికి మించి అంచనాలు, ఇబ్బడిముబ్బడిగా అప్పులు.. అయినా ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రాష్ట్ర ఆదాయం చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు సరిపోతుంది. మరి తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుంది? కార్పొరేషన్ల పేరుతో పెద్ద ఎత్తున అప్పులు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని అడుగుతున్నారు.. రాష్ట్ర అభివృద్ధి కోసమే కేంద్రం పీయూసీలు, సెంట్రల్ కార్పొరేషన్ల ద్వారా లక్షల కోట్ల రూపాయల రుణం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది. ఒక ఎకరం వరి సాగు చేసే రైతుకు ఏడాదికి 18000 సబ్సిడీ ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ప్రధాని కిసాన్ సమ్మాన్ 6000 సాయం దీనికి అదనం. ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో ప్రతి పేదవాడికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం, బస్తీ దవాఖానలను కేంద్రం ఇచ్చింది. తెలంగాణలోనే లక్షా 20 వేల కోట్ల జాతీయ రహదారి పనులు చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం.. ట్రిపుల్ ఆర్ రోడ్డుకు కేంద్రం 25 వేల కోట్లు ఖర్చు పెడుతున్నది. హైదరాబాద్ టు వరంగల్ వరకు జాతీయ రహదారి సిమెంట్ రోడ్డు వేసింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరించింది. కొత్త రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించింది. కేంద్రం తెలంగాణకు ఏం ఇచ్చిందో మరో వేదికపై తెలంగాణ ప్రజలకు వివరిస్తం. నరేంద్ర మోదీ ఆశీస్సులతో తెలంగాణను అభివృద్ధి చేసుకుందాం.. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు కొత్త రైల్వే ప్రాజెక్టు కోసం కేంద్రం సర్వేప ప్రారంభించింది. 20 వందే భారత్ ట్రైన్లలో తెలంగాణకు కేంద్రం రెండు ఇచ్చింది. 700 కోట్ల సికింద్రాబాద్ స్టేషన్ పనులకు ప్రధాని స్వయంగా శంకుస్థాపన చేశారు. తెలంగాణలో 30 రైల్వే స్టేషన్లను కేంద్రం ఆధునీకరిస్తున్నది.తెలంగాణ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. దేశవ్యాప్తంగా సుమారు నాలుగు కోట్ల ఇండ్లు కట్టింది కేంద్రం.. కానీ ఈ రాష్ట్రంలో పేదలకు ఇండ్లు లేవు. ప్రతి పేదవాడికి 5 లక్షల కార్పొరేట్ వైద్యం మోదీ ప్రభుత్వం ఇస్తున్నది. వరదలతో రైతులు నష్టపోతున్నరు. కేంద్రం ఫసల్ బీమా యోజన తెస్తే.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం, మోదీ కారణంగానే దేశానికి, ఆయా రాష్ట్రాలకు పెట్టుబడులు వస్తున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో సాధించిన విజయాలు' అనే అంశంపై గోల్కొండ కోటలో రెండు రోజుల ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించి సందర్శించారు.

### వ్యాన్, బస్సు ఢీ..పలువురికి గాయాలు, ఆరు గొర్రెలు మృతి

**నెల్లూరు**

జాతీయ రహదారిపై వ్యాన్ , ట్రావెల్స్ బస్సు ఢీకొన్నఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. ఆరు గొర్రెలు మృతి చెందాయి. శుక్రవారం తెల్లవారుజామున 04:00 గంటల సమయంలో కొడవలూరు మండలము నాయుడుపాలెం సమీపంలో జాతీయ రహదారి పైన కావలి నుండి నెల్లూరు వైపు వెళుతున్న రొయ్యలు వ్యాన్ వెళుతూ ఉండగా కొన్ని గొర్రెలు రోడ్డుకు అడ్డం వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో వ్యాన్ డ్రైవర్ వాహానాన్ని స్లో చేసాడు. అదే సమయం లో వెనుక నుండి వేగంగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వ్యానును ఢీ కొట్టింది. ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో సుమారు 15 మందికి గాయాలయ్యాయి. ఆరు గొర్రెలు కూడా చనిపోయినట్టు కొడవలూరు పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రులను నెల్లూరు లోని ఆసుపత్రికి తరలించి ఈ ఘటన పై విచారణ చేపట్టారు

### ఇల్లు రాలేదు..భూమి ఇవ్వలేదు.. టవరెక్కి నిరసన

**సంగారెడ్డి**



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున యువకుడు సెల్ టవర్ ఎక్కి యువకుడు నిరసన చేసిన ఘటన గుమ్మడిదల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన అన్వర్ అనే యువకుడు శుక్రవారం రోజు ఉదయం బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ లోని టవర్ పైకి ఎక్కి నిరసనకు దిగాడు. తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిదేళు గడుస్తున్నా. ఇప్పటివరకు నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ అందని ద్రాక్ష గానే మిలిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తనకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు మూడు ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాడు. స్థానిక నాయకులు పోలీసులు వచ్చి యువకుడికి నచ్చజెప్పి కిందికి దించే ప్రయత్నం చేస్తున్నారు.

### దేవినేనికి పరపతి లేదు..విలువ లేదు

**విజయవాడ**

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం నాడు విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో రక్షిత మంచినీటి పథకానికి భూమిపూజ చేసారు. తరువాత అయన మాట్లాడుతూ రం మాజీమంత్రి నైజాన్ని ఎండగట్టారు. దేవినేని ఉమామహేశ్వరరావు నెత్తిన రూపాయి పెడితే అతడికి అర్ధరూపాయి కూడా డబ్బు పుట్టే పరిస్థితి లేదని అన్నారు. ఎందుకంటే దేవినేని ఉమాకు పరపతి, విలువ లేదు. 2019లో ఎన్నికలకు ముందు ఎన్నో శిలాఫలకాలు వేశాడు. దేవినేని ఉమా నైజం ప్రజలందరికీ తెలుసని అన్నారు.

### ఆమెరికాలో రేవంత్ కు ఘన స్వాగతం

**న్యూఢిల్లీ**



అమెరికా చేరుకున్న టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి కి అక్కడి జేఎఫ్కే ఎయిర్ పోర్టులో అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి తోపాటు హర్యానా రాజ్యసభ సభ్యులు దిపెంధర్ హుడా కూడా ఉన్నారు..

### అడబాల ట్రస్టు చే విద్యార్థులకు అభినందన

**కాకినాడ**




రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ వై డి రామారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. చదువు, కెరీర్ గురించి ఆలోచించాలి తప్ప ఇతరత్రా ఆకర్షణకు లోను కారాదన్నారు. చిన్నతనం నుంచి నైతిక క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. ఒక్కొక్క విద్యార్థికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతి అందజేసిన కొప్పిశెట్టి సురేష్- అనిత దంపతుల సేవా నిరతి ప్రశంసనీయమని రామారావు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు రేయింబవళ్లు కష్టపడి రూపాయి రూపాయి సంపాదించి పిల్లలను చదివిస్తున్నందున వారు మంచి మార్కులు తెచ్చుకుంటే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీ నగేష్, రాజా, చందద్రావు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### 57 మంది బీహారీ బాలుర పట్టివేత

**వరంగల్**

వరంగల్ రైల్వే స్టేషన్లో 57 మంది బాలురను చైల్డ్ లైన్ సిబ్బంది పట్టుకున్నారు. వీరంతా బీహార్ నుండి వరంగల్ హనుమకొండ కు వస్తున్నట్లు సమాచారం. వేయి స్తంభాల గుడిముందు ఉన్న మదరస లో, కాశిబుగ్గ లో చేర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. అసలు వీరంతా రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫార్మ్ పై పడుకొని ఉండటంతో ప్రయాణికులు ఆందోళన పడుతున్నారు

### మద్యం మత్తులో డ్రైవర్..ఇంటిని ఢీకొట్టిన కారు

**వరంగల్**

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరం స్టేజ్ వద్ద కారు డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. మద్యం మత్తులో అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంతో కారు రహదారి పక్కన ఉన్న ఇంటిలోకి దూసుకెళ్లి బాత్రూమ్ గోడను ఢీకొంది. అదృష్టవశాత్తూ ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సురక్షితంగా బయటడ్డాడు

### భట్టి విక్రమార్క కు ఘన స్వాగతం

**అచ్చంపేట నియోజకవర్గం**



సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కర్నూల్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గం, బలుమూరు మండలం నర్సాయిపల్లి గ్రామానికి చేరుకుంది. భాజా భజంత్రీలు, డప్పులు, కొమ్ముబూరలు వాయిస్తూ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున భట్టికి ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో లంబాడ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేసి హోరేత్తించారు.

అభిమానుల కోరిక మేరకు కొమ్ము బూరను ఉంది సర్కార్ పై జంగ్ సైరన్ మోగించారు. నర్సాయిపల్లి గ్రామస్తుల ప్రేమాభిమానాన్ని ఎన్నటికి మర్చిపోనని భట్టి తెలిపారు

### అందుబాటులో లేని వీఆర్వోలు

**నంద్యాల**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి వీఆర్వోలు అందుబాటులో లేనందువలన విద్యార్థులు చాలా ఇక్కట్లు పడుతున్నారు. ఈ గ్రామానికి ఇద్దరు వీఆర్వోలు ఉన్న ఒక విఆర్ఓ అయిన కూడా విధులకు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమయం విద్యార్థులకు చాలా విలువైనది ఏపీఆర్జేసీ, కాలేజీ అడ్మిషన్,ఎంసెట్ కౌన్సిలింగ్ ఇలా చెప్పుకుంటూ పోతే విద్యార్థులకు మంచి సీజన్, ఈ సమయంలో వీఆర్వోలు గైహాజరు వలన విద్యార్థుల జీవితాలు నాశనం కావాల్సి వస్తుంది. దానితోపాటు గ్రామ ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. కావున పై అధికారులు వారిపై చర్య తీసుకుని విద్యార్థులకు, ప్రజలకు సహకరించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

### చంద్రబాబు చిత్రపటానికి ధాన్యాభిషేకం

**పాలకొల్లు**

టిడిపి మేనిఫెస్టో లో రైతులకు సంవత్సరానికి 20వేల రూపాయలు పెట్టుబడి సాయం ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం పెనుమదంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో రైతులు టిడిపి శ్రేణులు చంద్రబాబు చిత్రపటానికి పంటచేలలో ధాన్యంతో అభిషేకం చేశారు. రైతు రాజ్యం చంద్రబాబు రాజ్యం రైతు పక్షపాతి చంద్రబాబు అంటూ పంటచేలలో జాతీయ జెండా, పసుపు జెండా, పచ్చజెండాలతో నినాదాలు చేశారు.

ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ ఈ జగన్ ప్రభుత్వంలో ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేక రైతులు రోడ్డున పారేసుకునే పరిస్థితి ఏర్పడిందని ధాన్యం అమ్ముకోవాలంటే 10,000, 20,000 , 30,000 మిల్లర్లకు కట్టే పరిస్థితి ఏర్పడిందని, ఈ జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతి కాదు భక్షపాతి అంటూ విమర్శించారు.టిడిపి మేనిఫెస్టోలో చంద్రబాబు రైతుకు సంవత్సరానికి 20000 చొప్పున అంటే ఐదు సంవత్సరాలలో ప్రతి రైతుకు కవులు రైతుకు కూడా లక్ష రూపాయలు భరోసాను కల్పించారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు

### మదనపల్లె కు పోటెత్తిన టమోటా

**మదనపల్లె**

టమోటా పంటకు మదనపల్లె మార్కెట్ యార్డు నందు గరిష్ఠ ధర పలుకుతుండటంతో చుట్టుపక్కల రైతులు ఇక్కడికే తమ పంటను తీసుకు రావడంతో ట్రాఫిక్ జామ్ అవుతోందని మార్కెట్ యార్డు డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి తెలిపారు. రైతులు పండించిన టమాటా పంటకు గరిష్ఠంగా క్రేట్ 700 రూపాయలు పలకడంతో రైతులు ఇక్కడికి వచ్చి తమ పంటను అమ్ముతున్నారని వివరించారు.

### తిరుమలకు వచ్చే వాహనాల ఫిట్నెస్ తనిఖీలు

**తిరుమల**

తిరుమల ఘాట్ రోడ్ లో ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అలిపిరి చెక్ పోస్ట్ వద్ద వాహనాల ఫిట్నెస్ ను తనిఖీ చేసి కొండకు అనుమతించాలని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఆచితూచి చంద్రబాబు అడుగులు

**విజయవాడ :**

తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తేవాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తహతహలాడుతున్నారు. 73 ఏళ్ల చంద్రబాబు తన వయస్సు గురించిన ఆందోళనలను కూడా పక్కనబెట్టి పార్టీ కోసం శ్రమిస్తున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీని గద్దె దించటమే లక్ష్యంగా ముందుకు కదులుతున్నారు. వీలైనంత ఎక్కువ సమయం ప్రజల మధ్య ఉండేందుకు టీడీపీ అధినేత ప్రయత్నిస్తున్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ ఇప్పుడు అనేక రాజకీయ సవాళ్లు ఎదుర్కొంటోంది. వైసీపీతో పోల్చి చూస్తే టీడీపీలో యువతరం నేతల లేమి స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికీ చంద్రబాబు తన తరం నేతల మీద ఆధారపడి బండి లాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలి మహానాడును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించారు. 'మహానాడు'కు ముందు టీడీపీ అధినేత చాలా కసరత్తు చేశారు. కొంత కాలంగా పార్టీ క్యాడర్‌తో తరచూ వర్చువల్ సమావేశాలతో టచ్‌లో ఉన్నారు. కార్యకర్తలకు నిరంతం అందుబాటులో ఉన్నారు. ఆయన శ్రమ మహానాడులో కనిపించిందని పార్టీ వర్గాలు అంటున్నారు.మహానాడు గ్రాండ్ సక్సెస్ అయిందనే భావనలో టీడీపీ నాయకత్వం ఉంది. రాజకీయ వర్గాలలో కూడా ఇలాంటి అభిప్రాయమే వ్యక్తమవుతోంది. కనీసం రెండు లక్షల మంది కార్యకర్తలు అభిమానులు ఈ సభకు హాజరయ్యారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. తీవ్ర నిరాశలో ఉన్న టీడీపీ శ్రేణులకు ఇది గొప్ప ఉత్సాహం ఇస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. పార్టీ తిరిగి అధికారాన్ని దక్కించుకుంటుందన్న నమ్మకాన్ని వారిలో తప్పకుండా ఇది పెంచుతుంది.ప్రస్తుత ఎన్నికల రాజకీయాల్లో అధికార పార్టీకైనా, విపక్షాలకైనా ఓ బలమైన ఎన్నికల నినాదం అనివార్యం. 2024 ఎన్నికల కోసం 'క్విట్ జగన్, సేవ్ ఆంధ్రప్రదేశ్' అనే స్లోగన్‌ను మహానాడు వేదికగా చంద్రబాబు నినదించారు. 2024కి సన్నద్ధతకు పిలుపుగా ఈ నినాదాన్ని చూడవచ్చు. ఇక నుంచి



పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లి నిరంతరం వైసీపీ పాలనా వైఫల్యాలను ప్రచారం చేయాలని చంద్రబాబు కార్యకర్తలకు బోధించారు.2019 అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ దాదాపు 40 శాతం ఓట్లు సాధించింది. అయితే 175 అసెంబ్లీ స్థానాలలో కేవలం 23 సీట్లు మాత్రమే గెలవగలిగింది. మరోవైపు వైఎస్ఆర్‌సీపీ దాదాపు 50 శాతం ఓటింగ్‌తో 151 చోట్ల గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ ఘోర పరాజయం టీడీపీ శ్రేణులను చెల్లాచెదురు చేసింది. ఇంటిపోరు.. అంతర్గత సమస్యలతో కుదేలైన పార్టీని తిరిగి బలోపేతంచేసి ఎన్నికలకు సిద్దం చేయటం అంత సులభం కాదు. అందుకే తన వయస్సును కూడా లెక్క చేయకుండా.. విశ్రమించకుండా చంద్రబాబు పార్టీ కోసం శ్రమిస్తున్నారని టీడీపీ వర్గాలు అంటున్నాయి. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకతను ఇప్పటి నుంచే బలంగా ప్రజలలోకి తీసుకువెళ్లి ఎన్నికల సమయానికి తమకు గెలుపు వాతావరణం సృష్టించుకోవటమనే ఏకైక ఎజెండాతో చంద్రబాబు ముందుకు సాగుతున్నారు. అందుకే ఆయన నిరంతర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు, విమర్శలు చేయటమే పనిగా పెట్టుకున్నట్టు కనిపిస్తోంది.వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం దివాళా తీసిందని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు టీడీపీ నాయకత్వం ప్రయత్నిస్తోంది. పలు ప్రజా సమస్యలు, అధిక ధరలు, రైతు బాధలను టీడీపీ ప్రధానాస్త్రాలుగా మలుచుకుంటోంది. జగన్ మూడేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని, ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని.. వైసీపీ నేతలు భయోత్పాతం సృష్టిస్తున్నారంటూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.ప్రజలపై అధిక పన్నుల భారం మోపి నానా ఇబ్బందులు పెడుతున్నారంటూ ప్రజాక్షేత్రంలో నిప్పులు చెరుగుతున్నారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తున్న వారిపైనే తిరిగి కేసులు పెడుతున్న పరిస్థితి ఉందని, రౌడీలతో కొట్టిస్తున్నారని, ఆ భయంతో ప్రజల్లో భాద, చిరాకు అసహనం పెరిగిందని టీడీపీ అంటోంది. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లటం తన బాధ్యత అంటున్నారు చంద్రబాబు. అయితే టీడీపీ ఆరోపిస్తున్నట్టు నిజంగానే క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి ఉందో లేదో తెలియదు. వైఎస్ జగన్ ప్రజా సంక్షేమ పథకాల ముందు చంద్రబాబు ఆరోపణలు ఎంతవరకు పనిచేస్తాయో కూడా తెలియదు. వైసీపీ తన మూడేళ్ల పాలనలోఅనేక ప్రత్యక్ష ప్రయోజన బదిలీ పథకాలు ప్రవేశపెట్టింది. తద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ చేస్తోంది. ఇందుకు గానూ ప్రభుత్వం గడచిన 30 నెలలలో రూ.1.16 లక్షల కోట్లు ఖర్చు చేసింది. తమ పట్ల ప్రజలలలో అసలు వ్యతిరేకతే లేదని వైసీపీ నాయకత్వం పూర్తి విశ్వాసంతో ఉంది.ఇదిలా ఉంటే.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగా వెళుతుందా? పొత్తులు పొట్టుకుంటుందా అనే దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. పొత్తుల అంశంపై మహానాడులో సిగ్నల్ ఇస్తారని చాలా మంది బావించారు. కానీ ఆ అంశం ప్రస్తావనకే రాలేదు. ఎన్నికలకు ఇంకో రెండేళ్ల సమయం ఉన్నందున బహుశా దాని గురించి ఇప్పుడే ఎందుకు చర్చ అని బావించి ఉండవచ్చు. పైగా ఇప్పుడు పొత్తులన ప్రస్తావన తీసుకువస్తే ప్రజల ఆలోచనలు ప్రభుత్వ వైఫల్యాల నుంచి పక్కకు జరిగి పొత్తుల మీదకు వెళుతుంది. ఇప్పటికిప్పుడు టీడీపీ టార్గెట్ వీలైనంత ఎక్కువగా ప్రజలలలో ప్రభుత్వ వ్యతిరేకత వచ్చేలా చేయటం. ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే సందేశాన్ని బలంగా వినిపించటం. అలాగే ప్రజాక్షేత్రంలో టీడీపీ విశ్వసనీయతను పెంచటం. ఇవి బాబు తక్షణ లక్ష్యాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# జిహెచ్ఎంసి లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

**హైదరాబాద్**

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసుల వందనం స్వీకరించి జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ డి.ఎస్.లోకేష్ కుమార్, ఈ.వి.డి.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ ప్రియాంక అలా, ఈ.ఎన్.సి జియా ఉద్దీన్, ప్రాజెక్ట్ సి.ఇ దేవానంద్, అడిషనల్ కమిషనర్లు సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడీ, యాదగిరిరావు, సిసిపి దేవేందర్ రెడ్డి, అడిషనల్ సిసిపి శ్రీనివాసరావు, హౌసింగ్ ఎస్.ఇ విద్యాసాగర్, ప్రాజెక్ట్ ఎస్.ఇ లు వెంకటరమణ, రవీంద్ర రాజు, ఎస్.డబ్ల్యూ.ఎం కోటేశ్వరరావు, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, చీఫ్ వెటర్నరీ డా. అబ్దుల్ వకీల్, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, జాయింట్ కమిషనర్లు శశికళ, సంధ్య, ఉమా ప్రకాష్, స్పోర్ట్స్ డైరెక్టర్ భాషా, పి.డి సౌజన్య, సెక్రటరీ లక్ష్మి, తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్నాను. నీళ్లు, నిధులు నియమకాలు మలి దశ స్వరాష్ట్ర సాధనలో 14 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ దశాబ్దానికి చేరుకున్నాము. ఉద్యమ నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం వలన ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి సంక్షేమ పథకాలను వినూత్న పద్ధతిలో అమలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు.

గ్రేటర్ లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన ప్రజా రవాణా కోసం ఆధునిక రోడ్డు వ్యవస్థ, సంక్షేమం, సామాజిక, ఆర్థిక పరమైన అభివృద్ధికి నగర వాసులకు జీహెచ్ఎంసీ ద్వారా పూర్తి తోడ్పాటు అందిస్తున్నదన్నారు.మరింత సంతృప్తికరమైన సేవలను అందించేందుకు వార్డు కార్యాలయాలను తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 10వ తేదీన సుపరిపాలన దినోత్సవం సందర్భంగా ప్రారంభించబడుతుందని తెలిపారు.

# ఉద్యోగుల కోసం ట్విన్ టవర్స్

**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో నూతన సచివాలయం పూర్తిస్థాయిలో పనిచేస్తున్న నేపథ్యంలో ఆయా హెచ్‌వోడీల కార్యాలయాలను ఒకేచోటకు చేర్చడంపై సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులతో ఇటీవలే చర్చించారు. అన్ని రంగాలకు చెందిన ప్రభుత్వశాఖల్లోని హెచ్‌వోడీలు, వారి ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి సమీపంలో విశాలమైన ప్రభుత్వం స్థలాలు ఎకడెకడున్నాయో ఆరా తీశారు. స్థల నిర్ధారణ తర్వాత అవసరం మేరకు హెచ్‌వోడీల కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా ట్విన్ టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్టు సీఎం తెలిపారు. సెక్రటేరియట్‌కు సమీపంలో ట్విన్ టవర్స్ నిర్మాణం బాధ్యతలను చీఫ్ అడ్వయిజర్, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ కు సీఎం కేసీఆర్ అప్పగించారు. ఆయన ఆధ్వర్యంలో అధికారుల బృందం సెక్రటేరియట్‌కు దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించి, సీఎంకు రిపోర్టు అందజేసినట్లు తెలిసింది. ట్విన్ టవర్స్ నిర్మాణం కోసం పాటిగడ్డ, రెడ్ హిల్స్, ఆదర్శ్ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను అధికారులు పరిశీలించారు. పాటిగడ్డలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నది. అక్కడ టవర్స్ నిర్మించి, సెక్రటేరియట్‌కు వచ్చేందుకు వీలుగా పాటిగడ్డ నుంచి సంజీవయ్య పార్కు ప్రాంతం వరకు 600 మీటర్ల పొడవుతో రైల్వే ట్రాక్ పై నుంచి బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ బ్రిడ్జి నిర్మిస్తే బేగంపేట పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుందని భావిస్తూ ఉన్నారు. పాటిగడ్డ స్థలం వద్దనుకుంటే, సెక్రటేరియట్ సమీపంలోని ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్ లో నిర్మించవచ్చని.. అక్కడి నుంచి సెక్రటేరియట్‌కు వచ్చేందుకు స్కై వేను నిర్మించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రస్తుతం ఎమ్మెల్యే క్వార్టర్స్ పూర్తిగా పాతపడినవి, పక్కనే ఉన్న రిడ్జ్ హోటల్ స్థలం, ఆ వెనుక ఉన్న లోకాయుక్త బిల్డింగ్ స్థలాన్ని సేకరిస్తే, ట్విన్ టవర్స్‌కు కావాల్సినంత స్థలం అందుబాటులోకి వస్తుందని వివరించారు. సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే భూమి పూజ చేసేందుకు అధికారులు రెడీగా ఉన్నారు. స్థలం ఎంపిక ఫైనల్ అయిన తర్వాత సీఎం కేసీఆర్ స్వయంగా ఆ ప్రాంతంలో పర్యటించి, టవర్స్ నిర్మాణంపై సలహాలు, సూచనలు చేస్తారు.

# పిఠాపురం ఫ్యాన్ కెక్కలు చెల్లా చెదురు

**కాకినాడ :**

కాకినాడ జిల్లాలోని పిఠాపురం వైసీపీలో కొత్త సెగలు రేగుతున్నాయి. ఎంపీ వంగాగీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు మధ్య రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఇద్దరూ పిఠాపురం కేంద్రంగా పొలిటికల్ ఎత్తుగడలు వేస్తున్నారు. రోజులు గడిచేకొద్దీ అవి కాకరేపుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు వేసే ఎత్తుగడలు.. రాజకీయ వ్యూహాలు ఆసక్తిగా మారుతున్నాయి.వంగా గీత కాకినాడ వైసీపీ ఎంపీగా ఉన్నారు. అంతకుముందు టీడీపీ తరఫున జడ్పీ ఛైర్‌పర్సన్‌గా.. రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు. వంగా గీత సొంత నియోజకవర్గం పిఠాపురం. కాకినాడ పార్లమెంట్ పరిధిలోనే ఉంటుంది. 2009లో పీఆర్పీ తరఫున పిఠాపురం నుంచి ఆమె ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కాంగ్రెస్‌లో కొనసాగారు. 2019 ఎన్నికల వరకు సైలెంట్‌గా ఉన్న ఆమెకు.. అప్పటి వరకు కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా ఉన్న చెలమలశెట్టి సునీల్ టీడీపీలోకి వెళ్లిపోవడంతో రాజకీయంగా కలిసి వచ్చింది. వైసీపీ నుంచి ఎంపీగా పోటీ చేయడం గెలవడం చకచకా జరిగిపోయింది.పెండెం దొరబాబు 2004లో బీజేపీ నుంచి పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత వైసీపీలో చేరిపోయారు. 2014 ఎన్నికల్లో ఓడినా.. 2019లో గెలిచారు. వంగా గీత, దొరబాబు ఇద్దరూ ఒకే సామాజికవర్గం. ప్రస్తుతం ఒకే పార్టీ. అయినప్పటికీ ఇద్దరికీ అస్సలు పడదు. ఇటీవల కాలంలో పిఠాపురంపై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు వంగా గీత. ఇది ఎమ్మెల్యే దొరబాబుకు చిర్రెత్తుకు వస్తోందట. నియోజకవర్గంలో ఎవరి గ్రూప్ వారిదే. పార్టీ నాయకులు ఒకరితో సఖ్యతగా ఉంటే మరొకరికి శత్రువు కావడం ఖాయం అనే చర్చ ఉంది. పార్టీ ఒక్కటే అయినా వర్గాలు వేర్వేరుతన పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీగా పర్యటిస్తే తప్పేంటి అనేది గీత వేస్తున్న ప్రశ్న. కానీ, ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఇష్టపడటం లేదు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో హాజరైనా నోటితో నవ్వుకుని నొసటితో వెక్కిరించుకుంటున్న పరిస్థితి ఉంది. ఒకే పనికి చెరొక ఆర్డర్ ఇస్తుండటంతో అధికారులు సైతం తల పట్టుకుంటున్నారట. ఏదైనా ఉంటే మీరూ మీరూ తెల్చుకోవాలి కానీ.. మధ్యలో మమ్మల్ని డోలక్ వాయించినట్టు వాయిస్తే ఎలా మహాప్రభో అని గగ్గోలు పెడుతున్నారట అధికారులు. వైపీపీ కేడర్‌కి సైతం చుక్కలు కనిపిస్తున్నాయట.నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్ అని పార్టీ స్పష్టం చేసిందని.. మధ్యలో ఈ గూడు పుఠాణీ ఏంటన్నది ఎమ్మెల్యే దొరబాబు వాదన. అయితే వైసీపీలో చేరినప్పుడే అసెంబ్లీకి పోటీ చేయాలని వంగా గీత చూశారట. సామాజిక సమీకరణాల వల్ల ఆమెను కాకినాడ ఎంపీగా పోటీ చేయించింది పార్టీ. చెలమలశెట్టి సునీల్ తిరిగి వైసీపీలోకి రావడవంతో.. వంగా గీత పిఠాపురం అసెంబ్లీ సీటుపై కన్నేసినట్టు చెవులు కొరుక్కుంటున్నారు. వైసీపీలో మొదటి నుంచి ఉన్న తమను కాదని వేరెవరికో ఎలా టికెట్ ఇస్తారని దొరబాబు వర్గం కౌంటర్ ఇస్తోందట. ఈ క్రమంలోనే ఎంపీ దగ్గరకు వెళ్లిన వారికి ఎమ్మెల్యే దగ్గర పనులు కావని.. ఆయనకి టచ్‌లో ఉంటే ఆమె దగ్గర నోఎంట్రీ అని జోకులు పేలుతున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు, ద్వితీయశ్రేణి నేతలు సైతం ఇరువురు నేతల వ్యవహార శైలికి నొచ్చుకుం టున్నారట. ఎవరికి వారు తమ ఆధిపత్యం కోసం తమని బలి చేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారట. ఈ విషయం పార్టీ పెద్దలు దృష్టికి తీసుకుని వెళ్లాలని ప్రయత్నం చేసినా అవి ఆచరణలోకి రాలేదట.. ఈ లోపు రోజు రోజుకి నియోజకవర్గం ఫ్యాన్ పార్టీ లీడర్లకి హీట్ పెరిగిపోతోంది. మరి.. ఈ ఆధిపత్యపోరులో ఎవరు పైచెయ్యి సాధిస్తారో చూడాలి.

# 50 స్థానాల్లో పోటీకి మజ్లీస్ సిద్ధం

**హైదరాబాద్ :**

మజ్లీస్ పార్టీ.. కొన్నేళ్ల క్రితం వరకు హైదరాబాద్ పాతబస్తీకి మాత్రమే పరిమితమైన పార్టీ. అయితే ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఆ పార్టీ పనిచేస్తోంది. పలు రాష్ట్రాల్లో పార్టీ విస్తరణపై ఇప్పటికే విస్తృత కార్యక్రమాలు చేపడుతోంది. ఇటు త్వరలో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. హైదరాబాద్ వరకు మాత్రమే పరిమితం కాకుండా.. ముస్లీం ఓటర్లు ఎక్కువగా ఉన్న ఇతర నియోజకవర్గాలపైనా ఆ పార్టీ స్పెషల్ ఫోకస్ పెడుతోంది. తమకు బలమున్న కనీసం 50 స్థానాల్లో ఎన్నికల బరిలో నిలుస్తామని ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించింది. ఈ లక్ష్యంతో ఆ పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ముస్లీం ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మజ్లీస్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిస్తే ఏ పార్టీకి మేలు కలుగుతుంది? ఎవరికి నష్టం కలుగుతుందన్నది తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.హైదరాబాద్‌లోని 13 నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక్కడ ఆ పార్టీని ఓడించడం ఇతర పార్టీలకు అంత తేలికైన పనికాదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ నియోజకవర్గాలు ఎంఐఎం అభ్యర్థుల విజయం నల్లేరు మీద బండినడకే. కరీంనగర్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, సికింద్రాబాద్, అంబర్ పేట్, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్ తో పాటు మరికొన్ని ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గాల్లో పోటీ చేయాలని ఎంఐఎం నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీకి సదరు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్ ఉంది. గత కొన్నేళ్ల నుంచే ఆ పార్టీ అక్కడ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై మజ్లీస్ నేతలు ఫోకస్ పెట్టారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నా.. గత 9 సంవత్సరాలుగా ముస్లింలపై సవతితల్లి ప్రేమి చూపించారని అసదుద్దీన్ ఇటీవల చేసిన కామెంట్స్ తెలంగాణ రాజకీయ వర్గాల్లో హీట్ పెంచాయి. అనేక ప్రాంతాలలో ముస్లింలపై చాలా దాడులు అవమానాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ముస్లింల అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్‌తో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మొత్తానికి ముస్లీంల అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌తో ఇక కటీఫేనని అసద్ సంకేతాలిచ్చారు. అసద్ వ్యాఖ్యలతో ఏ పార్టీకి లబ్ధి చేకూర్చుతుంది.. ఏ పార్టీకి నష్టం జరుగుతుందనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో మొదలయ్యింది. మజ్లీస్ పార్టీకి దమ్ముంటే తెలంగాణలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారు స్టీరింగ్ మజ్లీస్ పార్టీ చేతిలోనే ఉందని ఆయన ఆరోపించారు.తాను బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని అన్నారు. కొన్నిచోట్ల ముస్లింలు అభివృద్ధికి నోచుకోవడం లేదని.. అందువల్లే తను అలా మాట్లాడాల్సి వచ్చిందని అసద్ చెప్పుకొచ్చారు. ముస్లీంల ప్రయోజనాల విషయంలో తాము ఎవరితోనూ రాజీపడబోమని ఆయన స్పష్టంచేశారు. ముస్లీంల అభివృద్ధి ఫోకస్‌గా పనిచేస్తామన్నారు.అసదుద్దీన్ ఒవైసీ చెప్పినట్టు తెలంగాణ వ్యాప్తంగా ముస్లీం ఓటర్లు ఎక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో మజ్లీస్ అభ్యర్థులు పోటీలో నిలిస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

# ముందుకు సాగని అలుగు నిర్మాణం

**కర్నూలు :**

సీమ ప్రజల గుండె చప్పుడు.. ప్రజల హృదయ స్పందన..సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్టు. అలుగు నిర్మాణం వలన కరువు సీమ దాహార్తి తీరడమే గాక సాగునీరు లభిస్తుంది. అలుగు నిర్మాణం వలన రాయలసీమ సామాజికంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నది సీమ వాసుల అభిప్రాయం.సీమ ప్రజల గుండె చప్పుడు.. ప్రజల హృదయ స్పందన..సిద్దేశ్వరం అలుగు. అలుగు నిర్మాణం వలన కరువు సీమ దాహార్తి తీరడమే గాక సాగునీరు లభిస్తుంది. అలుగు నిర్మాణం వలన రాయలసీమ సామాజికంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నది సీమ వాసుల అభిప్రాయం. అత్యంత ప్రాధాన్యత కలిగిన రాయలసీమ జీవనాడిగా పేర్కొన్న సిద్దేశ్వరం అలుగు నిర్మాణం మరొకసారి ఉద్రిక్తతలకు తావిస్తోంది. నేడు రాయలసీమ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి వేలాది మంది రైతులు పార్టీలకతీతంగా నిర్మాణం కోసం నడుం బిగించారు. అడుగడుగునా పోలీసులు ఆంక్షలు పెట్టినప్పటికీ ఎదుర్కొని వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.సరిగ్గా ఆరేళ్ల క్రితం?. అంటే మే 31, 2016లో సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం రాయలసీమ జలసాధన సమితి చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. వేలాది మంది రైతులు కాలినడకన వెళ్లి శంకుస్థాపన చేపట్టారు. ఎక్కడికక్కడ రైతులను అరెస్టు చేసినప్పటికీ శంకుస్థాపన కార్యక్రమం మాత్రం చేయగలిగారు. సరిగ్గా ఆరేళ్ల క్రితం అంటే నేడు మరోసారి నిర్మాణం చేపట్టేందుకు వేలాది మంది రైతులు నడుంబిగించారు. సిద్దేశ్వరం అలుగు పరిసర ప్రాంతాలలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. అయినప్పటికీ కూడా రైతులు ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మించాలని రాయలసీమ జలసాధన సమితి ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నది.. సీమ జిల్లాలకు సాగు, తాగునీరు పుష్కలంగా లభిస్తుంది. ఈ ప్రాజెక్టును విస్మరించడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. తమ శ్రమ దానంతో , సొంత ఖర్చుతో తమ ప్రాజెక్టులను తామే నిర్మించకుంటామని శపథం చేశారు.రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి ఇప్పటికే ఈ ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందే ప్రాంతాలన్నీ తిరిగి రైతులను చైతన్యం చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి భారతీయ జనతాపార్టీ కూడా సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎలాంటి ప్రకటన చేయలేదు. టిడిపి కూడా అదే పరిస్థితిలో ఉంది. పార్టీలకతీతంగా ప్రాజెక్టును తామే నిర్మించుకుంటామని ఎవరు అడ్డు చెప్పవద్దు అని కోరుతున్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన ముఖ్యమంత్రి జగన్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిద్దేశ్వరం అలుగు పై దృష్టి సారించాలని కోరారు. సిద్దేశ్వర మీదుగానే ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణం జరగబోతోందని ఈ ప్రాంతంలో వంతెనకు కూడా నిర్మించాల్సి ఉంది. దీంతో పనిలో పనిగా అలుగు నిర్మాణం చేయడం చాలా ఈజీ అని, పాలకులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రంలో అధిక ఫీజులు కట్టడి ఉత్తమాటేనా

**-కమిటీలు ఇచ్చిన సిఫార్సులను పక్కన పెట్టిన పాలకులు**

**-ఇష్ట రాజ్యాంగ ఫీజులు పెంచుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు**

**హైదరాబాద్**

రాష్ట్రంలోఅధిక ఫీజులను కట్టడి చేస్తామని తొమ్మిది సంవత్సరాలు కమిటీలు వేస్తూ కాలాయాపన చేసి చివరికి ఆ కమిటీలు ఇచ్చిన సిఫార్సులను పక్కన పెట్టేశారు పాలకులు×.దీంతో ఫీజులు మళ్లీ ఎంత పెంచుతారో అంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 10వేల పైచిలుకు ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, వీటిలో 32 లక్షల మంది చదువుతున్నారు. అయితే ఇందులో కొన్ని పాఠశాలలకు కనీసం పర్మిషన్ ఉండదు, కేవలం అద్దె భవనాలు చూపిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా అడ్మిషన్ల పేర డబ్బులు దండుకుంటున్నాయి ప్రైవేట్ యాజమాన్యాలు. అయితే ఆ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నా వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం. వసతులు లేకున్నా! ఈ విద్యాసంవత్సరం గత ఫీజు కంటే నుంచి శాతం వరకు ఫీజులు పెంచి వసూల్ చేస్తున్నాయి ప్రైవేట్ యాజమాన్యాలు.

పైగా ఈ స్కూల్స్ బ్రాంచీల పేరుతో రాష్ట్రంలో నిర్మానుషంగా ఉండే ప్రాంతాల్లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలోని నారాయణ,శ్రీ చైతన్య, భాష్యం, సెయింట్ జోసెఫ్ పబ్లిక్, కృష్ణవేణి టాలెంట్, శాంతినికేతన్, నాగార్జున స్కూల్స్ వివిధ ప్రాంతాలలో బ్రాంచీల పేరుతో విద్యా వ్యాపారం సాగిస్తూ పుస్తకాలు, బూట్లు, టై, బెల్ట్ వరకు ఇష్టం వచ్చినట్లు రేటు పెట్టి అమ్ముతున్నారు. నిజానికి ప్రభుత్వ సూచనల మేరకు స్కూల్ పరిధిలో ఇవి అమ్మరాదు అని నిబంధన ఉన్న పట్టించుకోకుండా వీటిని అమ్ముతున్నారు. ఈ స్కూళ్ళకు పూర్తిస్థాయిలో భవనాలు ఉండవు, క్రీడా స్థలాలు ఉండవు, ఇరుకైన తరగతి గదులు, మౌలిక సదుపాయాలు ఉండవు, ఫైర్ సేఫ్టీ ఉండవు అయినప్పటికీ ఈ స్కూలుకు రెన్యువల్‌కు దరఖాస్తు పెట్టుకుంటే విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. నియంత్రణ చట్టం ఏమైంది? రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై మార్చ్ నెలలో ప్రొ. తిరుపతిరావు నేతృత్వంలో ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి పేజీల నివేదికను అందించింది. అయితే ఆ కమిటీ ప్రతిఏటా దాదాపుగా శాతం ఫీజు పెంచుకోవచ్చనే ప్రతిపాదన చేసింది. కానీ ఫీజుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రభుత్వ వెబ్ సైట్‌లో ఉండాలని సూచించింది. అలాగే స్కూల్ ఫీజుల పెంపును నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టం చేయాలని నిర్ణయం తీసుకొని దీనికోసం విధివిధానాలు ఏర్పాటు చేసేందుకు ఉపసంఘాన్ని సైతం నియమించారు. దీనిని ప్రత్యేక చట్టం చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలి. కానీ ఇప్పటివరకు ఆ ప్రయత్నం జరగలేదు. ప్రత్యేక చట్టం చేయాలని విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ అసోసియేషన్ నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం పెద్దలు నిమ్మకు నీరుతున్నట్టు వ్యవహరిస్తున్నారు. నిజానికి ఏ విద్యా సంస్థనైనా ట్రస్ట్ పేరిట నడపాలి. దానికి ఒక గవర్నమెంట్ బాడీ ఏర్పాటు చేయాలి. అయితే కార్పొరేట్ పాఠశాలలో నామమాత్రంగా గవర్నమెంట్ బాడీని చూపిస్తున్నా, అధికారం మొత్తం యాజమాన్యం చేతుల్లో పెట్టుకుంటుంది. కొన్ని స్కూల్స్ ఒకేసారి మొత్తం ఫీజు కట్టాలని నిబంధనలను అమలు చేస్తున్నాయి. లేదంటే అడ్మిషన్లు ఇవ్వడం లేదు. అందుకే వెంటనే రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణ ఉండేటట్టు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# స్వల్ప కాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా తెలంగాణ

**- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజ్**

**నాగర్ కర్నూల్**

తెలంగాణలో ప్రజలకు మెరుగైన పాలన కోసం పరిపాలన సంస్కరణలతో ఏర్పాటైన కొత్త జిల్లాలు, మండలాలతో పరిపాలన సౌలభ్యం ప్రజల చెంతకు చేరిందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజ్ పాల్గొన్నారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం అమరుల స్తూపం వద్ద నివాళులర్పించి అమర వీరులకు పుష్పాంజలి ఘటించి, జాతీయ జెండాను ఆయన ఆవిష్కరి ంచారు. అనంతరం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజ్ మాట్లాడుతూ..... తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. గతంలో చెరువులు ఎండిపోయి ఉండేవని.. ఇప్పుడు నిండుగా మండుటెండల్లోనూ నిండుగా ఉన్నాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం యుద్ధాలు జరిగేవని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. తెలంగాణ ప్రజల హృదయాలు ఆనందం, గర్వంతో నింపుకున్న సందర్భమని అన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది త్యాగాలు చేశారన్నారు. తెలంగాణ ఉద్యమ అమరవీరులకి, వారి అంకితభావానికి హృదయపూర్వకంగా నివాళి అర్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.తెలంగాణ ప్రజల కోటి ఆశలు కొంగ్రొత్త చిగుర్లు తొడిగిన రోజు జూన్ 2. తెలంగాణ ప్రజల స్వప్నం సాకారమైన రోజు.. తెలంగాణ ఆవిర్భవించి పదోవసంతంలోకి అడుగుపెడుతోన్న వేళ.. అమరుల నెత్తుటి త్యాగాలను స్మరించుకుంటూ.. దశాబ్ది వేడులకు సర్వసన్నాహాలు చేసిందని అన్నారు .ముఖ్యమంత్రి గారి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం 9 ఏళ్ల స్వల్ప కాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకొందని ప్రజా సంక్షేమంలోనూ అభివృద్ధి లోను యావత్ భారతదేశానికే ఆదర్శప్రాయంగా నిలిచిందని అన్నారు.'తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుకరిస్తుంది" అని చెప్పుకునే స్థాయికి చేరుకుందని ఇది తెలంగాణ ప్రజలకు గర్వ కారణమని ఆయన అన్నారు.నాగర్ కర్నూల్ జిల్లాను అభివృద్ధి పథంలో ఉంచడానికి పనిచేస్తున్న జిల్లా యంత్రాంగానికి, మంత్రివర్యులకు, పార్లమెంట్ సభ్యులకు, శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో దశాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. నూతన కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ భవనాన్ని ఈనెల ఆరో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోనున్నట్లు ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ జిల్లా ఎస్పీ కే మనోహర్ లతో కలిసి స్టాల్స్ ను ఆయన సందర్శించారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక కళాకారులు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.విద్యార్థులను అభినందించి జ్ఞాపకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శాంత కుమారి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు మను చౌదరి, మోతిలాల్, అదనపు ఎస్పీలు భరత్, రామేశ్వర్, ఆర్డీవో నాగలక్ష్మి డీఎస్పీ మోహన్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా ప్రతినిధులు విద్యార్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన

**మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్**



రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా వినాయక్ నగర్ లోని అమర వీరుల స్థూపం వద్ద మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నివాళులర్పించారు. తరువాత కలెక్టరేట్లో జాతీయ జెండా ఎగురవేసారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు గణేష్ గుప్తా, జీవన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధి హనుమంతు,జడ్పీ చైర్మన్ విఠల్ రావు,డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా ఇక్కడకు విచ్చేసిన వారందరికి నా ధన్యవాదములు మరియు బాలబాలికలకు నా ఆశీస్సులు. తెలంగాణ రాష్ట్రం సాధించుకొని, బంగారు తెలంగాణ గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామముగా కృషి చేయడం జరుగుతుంది.

మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 9 సంవత్సరాలు పూర్తి కాబడి 10వ సంవత్సరములోకి అడుగిడిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను జూన్ 2వ తేది నుండి 22వ తేది వరకు వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించుతూ ఘనంగా నిర్వహిస్తున్నది. ఈ శుభవేళ మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిపిన మహోద్యమంలో మనమంతా భాగస్వాములం.

ముఖ్యమంత్రి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకున్నది. ప్రజాసంక్షేమంలోనూ అభివృద్ధిలోనూ యావత్ దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. "తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది" అని చెప్పుకునే స్థాయికి చేరుకుంది. గత తొమ్మిది సంవత్సరములలో 1.26 లక్షల ఎకరాలలో పెరిగి 2022 సంవత్సరము నాటికి 5.40 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. రైతు బంధు పథకం ఎకరానికి వానాకాలంలో 5,000 రూపాయలు మరియు యాసంగిలో 5,000 రూపాయలు నేరుగా రైతుల ఖాతాలలో జమ చేస్తున్నాం. రైతు బీమా పథకం కింద అర్హత కలిగి చనిపోయిన రైతు యొక్క నామినీ ఖాతాలో నేరుగా 5 లక్షలు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. వ్యవసాయ వినియోగదారులకు ప్రభుత్వం 24 గంటల ఉచిత మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తున్నది. మన జిల్లాలో వ్యవసాయ రంగానికి రూ.3,719.25 కోట్లతో ఉచిత విద్యుత్ అందించాం.

జిల్లాలో 2014 నుండి 2022 వరకు భారీ, మద్య తరహా, చిన్న నీటి పారుదల, చెక్ డ్యాంలు, చిన్న నీటి ఎత్తిపోతల పథకాలు మరియు పుష్కర ఘాట్ ల పనుల పై ఇప్పటి వరకు రూ.3,894.18 కోట్లు ఖర్చు చేసామని అన్నారు.

# చిత్తశుద్ధి అంకిత భావం బాధ్యత చాలా ముఖ్యం

**బద్వేలు ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి**

**ఎమ్మెల్యే డాక్టర్ సుధ బద్వేలు ఆర్టీవో**

**ఆకుల వెంకటరమణ**

**సెంచరీ ప్యానల్ పరిశ్రమ ద్వారా 36**

**మంది నిరుద్యోగులకు ఉద్యోగ**

**అవకాశాలు**

**వారికి నియామక పత్రాలు అందచేత**

**బద్వేలు**



చిత్తశుద్ధి అంకితభావం ఉద్యోగం పట్ల బాధ్యత ఉన్నప్పుడే హద్దుగా ఉన్న ఆకాశాన్ని కూడా దాటవచ్చని బద్వేల్ ఎమ్మెల్సీ బీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ అన్నారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు బాధ్యతా యుతంగా పనిచేసినప్పుడే ఉద్యోగులు ఉన్నతాధికారుల మన్ననలు పొందుతారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బద్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన మాట ప్రకారం భారీ పరిశ్రమ అయిన సెంచరీ ప్యానల్ పరిశ్రమను నియోజకవర్గానికి తేవడం జరిగిందని తద్వారా బద్వేల్ నియోజక వర్గం లోని నిరుద్యోగులకు భారీ ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని పేర్కొన్నారు. తద్వారా బద్వేల్ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య కొంతవరకు తగ్గుతుందని అన్నారు. శుక్రవారం బద్వేల్ పట్టణంలోని నాగ భూషణం డిగ్రీ పీజీ కళాశాలలో గతంలో ఇంటర్వ్యూ జరిపిన దరఖాస్తు దారుల ను ఎంపిక చేసి ఎంపికైన 36 మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ సెంచరీ ప్యానల్ సంస్థ ద్వారా ఈ ప్రాంతంలోని అనేకమందికి ఉద్యోగాలు వస్తాయని కానీ ముఖ్యంగా ఇతర ప్రాంతాల వారి కంటే స్థానికులకే ఎక్కువగా ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఉద్యోగాలు పొందిన వారు మనస్ఫూర్తిగా చిత్తశుద్ధితో ఫ్యాక్టరీ నియమ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ పాటిస్తూ ఫ్యాక్టరీ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. స్థానికులకే ఎక్కువగా అవకాశాలు కల్పించి వాళ్లకు శిక్షణ ఇచ్చి సంస్థలో చేర్చుకోవాలని పేర్కొన్నారు. యాజమాన్యం ఈ ప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అవకాశం కల్పించినందుకు సెంచరీ ప్యానల్ సంస్థ యాజమాన్యా నికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ, అడ చైర్మన్ గురు మోహన్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, సెంచరీ ప్యానల్ పరిశ్రమ జనరల్ మేనేజర్ రమేష్ రెడ్డి, దిలీప్ కుమార్, గిద్దలూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు బంగారు సీనయ్య, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ లు ఎర్ర గొల్ల గోపాలస్వామి రాచపూడి వెంకట సాయి కృష్ణ, టూర్ అండ్ ట్రావెల్ డైరెక్టర్ అల్లా ప్రకాష్ బద్వేల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ యద్దారెడ్డి, సెంచరీ ప్యానల్ పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు,

# బీఆర్ఎస్‌లో వర్గపోరు

**కరీంనగర్ :**

హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో వర్గపోరు నడుస్తోంది. అవినీతి ఆరోపణలపై ఈటలను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయడం అందరికీ తెలిసిందే. అయితే అనంతరం నిర్వహించిన ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ఈటల గెలిచిన విషయం విధితమే. అయితే ప్రస్తుతం కమలాపూర్ మండలంలో పార్టీ కార్యకర్తల మధ్య సఖ్యత లేక విభేదాలు తలెత్తుతున్నాయి. పార్టీ నేతల మధ్య వర్గపోరు ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికల్లో గెలవడం సాధ్యమేనా? అంటూ సొంత పార్టీ నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి సమక్షంలోనే కార్యకర్తలు ఒకరినొకరు దూషించుకున్నారు. ఆయన ఎంత చెప్పినా వినకుండా కుర్చీలు విసురుకున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడం ఆశ్చర్యపరిచింది. అంతేకాక ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు పాతవారిపై అజమాయిషి చలాయిస్తున్నారనే పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమను గుర్తించడం లేదని ఎవరికీ చెప్పుకోవాలో తెలియక కిందిస్థాయి నాయకులు మదనపడుతున్నారు. ఇటీవల హుజురాబాద్ ఉప ఎన్నికల ఎమ్మెల్యే అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి పనిచేసిన పార్టీ నాయకులు ఒక వర్గంగా, ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన పాడి కౌశిక్ రెడ్డి వర్గం నాయకుల మధ్య వర్గపోరు నడుస్తోంది. ప్రస్తుతం హుజురాబాద్ నియోజకవర్గ పూర్తి బాధ్యతలు కౌశిక్ రెడ్డికి అప్పగించగా నియోజకవర్గంలో పర్యటిస్తూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇటీవల పార్టీలో కొంతమంది నేతలు పార్టీ కోసం మనస్ఫూర్తిగా పనిచేయడం లేదంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈటల గెలిచినప్పుడు కూడా కొంతమంది ముఖ్యనాయకులు ఆయనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అయితే కొందరు ఒక పార్టీ జెండా పట్టుకుని ఇంకో పార్టీ కోసం పనిచేస్తూ సొంత పనిచేస్తున్నామంటూ చెప్పుకుంటూ పార్టీలో కొనసాగుతున్నారని ఒకరికొకరు ఆరోపణలు చేసుకుంటుండడంతో గొడవలు తారాస్థాయికి చేరాయనే పలువురు చర్చించుకుంటున్నారు. పార్టీలో విభేదాలు కొనసాగుతున్నాయంటూ సోషల్ మీడియాలో వార్తలు, వీడియోలు రావడంతో కౌశిక్ రెడ్డి పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్తాడనే అంశంపై మండలంలో అన్ని వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.ఈ వర్గ పోరు, వివాదాలు ఇలానే కొనసాగితే పార్టీలో ఉండి రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ప్రజల మధ్యకు రాలేమంటూ ఒక వర్గం నాయకులు అభిప్రాయపడినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా ముఖ్య నాయకులు మేల్కొని ఈటలపై గెలుస్తారో..? లేక వీరి విభేదాల వల్ల ఈటలకు లాభం చేకూర్చి మళ్లీ ఈటలకు పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

# తెలంగాణ కోసం కేంద్రం 4 లక్షల కోట్లిచ్చింది

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు , ఎంపీ బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి, జి.వివేక్, తమిళనాడు సహ ఇంఛార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, రవీంద్రనాయక్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, అధికార ప్రతినిధులు సీహెచ్.విఠల్, ఎన్వీ సుభాష్, రాణిరుద్రమదేవి, జె.సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ ఉద్యమకారులను స్మరించుకుంటూ, తెలంగాణ సాధన కోసం బీజేపీ ఎన్నో పోరాటాలు చేసింది. తెలంగాణ కోసం ఎంతోమంది యువకులు ఆత్మ బలిదానాలు చేసుకుంటుంటే... "మీరు ఆత్మహత్య చేసుకోవద్దు. తెలంగాణ కల సాకారం చేస్తాం."అంటూ సుష్మ స్వరాజ్ పార్లమెంట్ వేదికగా చెప్పడమే కాక తెలంగాణ బిల్లుకు మద్దతు ప్రకటించింది. పాతికేళ్ల క్రితమే ఒక ఓటు రెండు రాష్ట్రాల పేరుతో కాకినాడ తీర్మానం చేసిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు.

తెలంగాణను అభివృద్ధి చేసేందుకు నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది. తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతుందోంటే కేంద్రం ఇచ్చిన నిధులతోనే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ?

రామగుండం ఫ్యాక్టరీ కోసం 6 వేల 338 కోట్లు, జాతీయ రహదారుల కోసం 1.10 లక్షల కోట్లు, ధాన్యం కొనుగోళ్ల కోసం లక్ష కోట్లకుపైగా చెల్లించాం. మొత్తంగా 4 కోట్ల ప్రజల కోసం 9 ఏళ్లలో 4 లక్షల కోట్లు కేటాయించింది.

కేంద్రం 4 కోట్ల ప్రజల కోసం 4 లక్షల కోట్ల రూపాయలను కేటాయిస్తే... కేసీఆర్ మాత్రం నలుగురి కోసం పంచుకుంటూ తెలంగాణ సమాజాన్ని గాలికొదిలేసింది. అభివృద్ధిపై చర్చకు రమ్మని అడుగుతుంటే... చర్చకు రాకుండా కేసీఆర్ పారిపోతున్నడని ఆరోపించారు.

ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు బీజేపీ ప్రజా సంగ్రామ యాత్ర చేసింది. వాళ్ల బాధలను పంచుకుంది. సమస్యలన్నీ తెలుసుకున్నాకే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించాం. ఎందుకంటే విద్య కోసం ఒక్కో కుటుంబం సగటున రూ.లక్ష ఖర్చు చేస్తోంది. వాళ్లపై ఎనలేని భారం పడుతోంది. ప్రభుత్వ స్కూళ్లను చూస్తే అధ్వాన్నంగా మారాయి. కనీస వసతుల్లేవ్? చాక్ పీసులకు కూడా డబ్బుల్లేని దుస్థితి. ప్రభుత్వ స్కూళ్లను ఆధునీకరించి ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దుతాం. 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని అన్నారు.

కొట్లాడి సాధించుకున్న తెలంగాణ నలుగురి చేతిలో బందీ అయ్యింది. తెలంగాణ బంగారమైతే... రైతుల ఆత్మహత్యల్లో ఎందుకు అగ్రస్థానంలో ఉంటుంది. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటరు? జీతాలు రాక ఆర్టీసీ ఉద్యోగులెందుకు చనిపోతున్నరు? 317 జీవోవల్ల ఉద్యోగులెందుకు చెట్టుకొకరై నేలరాలిపోతున్నరు .అరే.. నిండు నూరేళ్ల జీవితమున్న ముక్కుపచ్చలారని విద్యార్థులెందుకు చనిపోతున్నరు? సింగరేణని అథోగతి పాలెందుకైంది. అన్ని శాఖల ఉద్యోగులు రోడ్డున పడ్డరు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణాల పేదల పరిస్థితి దారుణంగా మారిందని అయన అన్నారు.

ఒక్కసారి ఉద్యమకారులంతా తెలంగాణ ఉద్యమాలను గుర్తుకు చేసుకోండి. మిలియన్ మార్చ్, వంటా వార్పు, సకల జనుల సమ్మె స్ఫూర్తితో పోరాడదం. బీజేపీతో కలిసి రావాలని కోరుతున్నా. బీఆర్ఎస్ పార్టీని అంతమొందించడమే లక్ష్యంగా బీజేపీ చేసే పోరాటాలకు కలిసి రావాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నానని అయన అన్నారు.

# విరాట్ కర్ణ హీరోగా 'పెద కాపు-1'

సెన్సిబుల్ డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల, ద్వారకా క్రియేషన్స్ పై బ్లాక్‌బస్టర్ అఖండ చిత్రాన్ని అందించిన నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డితో కలిసి విరాట్ కర్ణను హీరోగా పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని కూడా నిర్మాతలు అనౌన్స్ చేశారు.

దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఈ సినిమా కోసం పవర్ ఫుల్, మాస్-అప్పీలింగ్ టైటిల్ 'పెద కాపు-1'ని లాక్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విరాట్ కర్ణని ఇంటెన్స్, రగ్గడ్ గా ప్రెజెంట్ చేశారు. భారీ జనసమూహంలో విజయానికి గుర్తుగా అభివాదం చేస్తూ కనిపించారు కర్ణ. మంచి లుక్స్ ఉన్న విరాట్ కర్ణ పర్ఫెక్ట్ మెటీరియల్. 'ఓ సామాన్యుడి సంతకం' అనేది సినిమా ట్యాగ్‌లైన్. ఫస్ట్ లుక్ అందరినీ ఆకర్షించింది.

మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పిస్తున్న ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఛోటా కె నాయుడు కెమెరామెన్ కాగా మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. ప్రముఖ యాక్షన్ డైరెక్టర్ పీటర్ హెయిన్స్ ఫైట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. రాజు సుందరం కొరియోగ్రాఫర్. పెద కాపు-1 షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది.

తారాగణం: విరాట్ కర్ణ



# 'స్వయంభూ', ఫెరోషియస్ ఫస్ట్-లుక్ విడుదల

హీరో నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా నిఖిల్ 20వ చిత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. చనిఖిల్20కి 'స్వయంభూ' అనే టైటిల్ పెట్టారు.

స్వయంభూ అంటే స్వయంగా ఉద్భవించినదని అర్థం. ' ఫస్ట్-లుక్ పోస్టర్ లో నిఖిల్ యుద్ధభూమిలో ఫెరోషియస్ వారియర్ గా కనిపించారు . పొడవాటి జుట్టు, ఒక చేతిలో ఆయుధం (ఈటె) , మరొక చేతిలో షీల్డ్‌తో పోరాట యోధుడిలా కనిపించారు. నిఖిల్ గెటప్, మేకోవర్ అద్భుతంగా వుంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభం కానున్న ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ తో క్యూరియాసిటీని క్రియేట్ చేసింది.

నిఖిల్ కెరీర్‌లోనే అత్యంత భారీ సినిమాగా స్వయంభూ నిలవనుంది. ఇది అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతోంది. రవి బస్రూర్ సంగీతం అందించగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్పగరి డైలాగ్స్ అందిస్తున్నారు.

తారాగణం: నిఖిల్






# భోళా శంకర్'- భోళా మానియా ఫస్ట్ లిరికల్ జూన్ 4న, సాంగ్ ప్రోమో జూన్ 2న విడుదల

వాల్తేరు వీరయ్య విజయంతో దూసుకుపోతున్న మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వంలో మెగా మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్' తో బిజీగా ఉన్నారు. రామబ్రహ్మం సుంకర అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.భోళా మానియా జూన్ 4న విడుదలయ్యే మొదటి సింగిల్ తో ప్రారంభమవుతుంది. మెగాస్టార్ చిరంజీవి అల్ట్రా-మోడిష్ అవతార్ లో స్టైలిష్ పోస్టర్ ద్వారా మేకర్స్ అనౌన్స్ చేసినట్లు రేపు పాట ప్రోమోను విడుదల చేయనున్నారు. చిరు స్పోర్ట్స్ షేడ్స్ తో స్టార్ చిహ్నాలు ఉన్న ఆకుపచ్చ చొక్కా ధరించి, త్రిశూల్ ఆకారంలో చైన్ ని తిప్పుతూ కనిపించారు.ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. జూన్ నెలాఖరకు సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్ భావోద్వేగాలు, ఇతర అంశాలు సమపాళ్లలో వుంటాయి.తమన్నా కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్ గా కనిపించనుంది. ట్యాలెంటెడ్ యాక్టర్ సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ తరహా పాత్రలో కనిపించనున్నారు.డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఎఎస్ ప్రకాష్



ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

భోళా శంకర్ ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్ , రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950